## మామిడి తోటలో రెండు భారీ కొండచిలువలు



పుంగనూరు రూరల్ జనవరి 24 ప్రభాతవార్త
మండలంలోని మద్రిమాకులపల్లి గ్రామ సమీపంలో ఓ మామిడి తోటలో శనివారం మధ్యాహ్నం రెండు భారీ కొండచిలువలు దర్శనమిచ్చాయి. సుమారు 13 అడుగుల పొడవు ఉన్న ఈ కొండచిలువలను పశువుల కాపరులు గుర్తించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శోభనాద్రి రెస్క్యూ టీంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు మూడు గంటల పాటు శ్రమించి రెండు కొండచిలువలను పట్టుకున్నారు. అనంతరం వాటిని అడవిలో సురక్షితంగా విడిచిపెట్టారు. ఫారెస్ట్ అధికారుల సకాలంలో స్పందించి చర్యలు తీసుకోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## అంతా సిద్ధం...అప్రమత్తం !

### నేటి ఉదయం నుండి రాత్రి వరకు వాహనసేవలు
### -భక్తులకు సంతృప్తికర సౌకర్యాలు





నేటి రథ సప్తమి సందర్భంగా మాడవీధుల్లో పూర్తిగా జర్మన్ షెడ్లు ఏర్పాటు

ప్రభాతవార్తప్రతినిధి–తిరుమల:
సూర్యజయంతి(రథసప్తమి) వేడుకలకు తిరుమల సిద్ధమైంది. అధికారయంత్రాంగం అన్ని రకాల చర్యలు తీసుకుని జాగ్రత్తలతో అప్రమత్తమయ్యారు. నేడుఒకరోజే ఉదయం నుండి రాత్రి వరకు వరుసగా ఏడు వాహనాలపై ఏడుకొండలస్వామి దర్శనమివ్వనుండటం విశేషం. నేటి ఉదయం 5.30గంటలకు తొలివాహనంగా సూర్యప్రభవాహనంపై శ్రీమన్నారయణుడు విశేష అలంకరణలో వాహనమండపం నుండి బయలుదేరి 8గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిస్తారు. ఆతరువాత ఉదయం 9గంటల నుండి 10గంటల వరకు చిన్నశేషవాహనం, ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గరుడవాహనం, మధ్యాహ్నం 1నుండి 2గంటల వరకు హనుమంతవాహనం, మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నాన మహోత్సవం, సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు కల్పవృక్షవాహనం, సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటల నుండి 9గంటల వరకు చంద్రప్రభవాహనసేవలు వరుసగా జరుగుతాయి. ఈ వాహనసేవల వీక్షణకు తిరుమలకు తరలివచ్చే 2లక్షలమందికిపైగా భక్తులకు చిన్నపాటి అసౌకర్యం కలగకుండా, లోటుపాట్లు తెలియకుండా టిటిడి అధికారయంత్రాంగం స్దిదమైంది. రథసప్తమి పర్వదినం ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలు, భద్రత అంశాలపై ఇప్పటికే టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్,అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్‌ఓ మురళీకృష్ణ, విజిలెన్స్,పోలీసు విభాగాల అధికారులు సమన్వయంతో స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లలోనికి వేకువజామున 3గంటల నుండి భక్తులను అనుమతిస్తారు. భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు. టీ,కాఫీ,పాలు అందించేలా శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులు సిద్ధమయ్యారు.

# రాక్షస పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి

**క్రెడిట్ లేనివారు క్రెడిట్ చోరీ అంటున్నారు**
**ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు**





సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, వివిధ స్టాళ్లను సందర్శిస్తున్న సిఎం

పుత్తూరు (నగరి), జనవరి 24 ప్రభాతవార్త
గత వైసిపి హయాంలో జరిగిన రాక్షస పాలన వల్ల రాష్ట్రం ఎంతో నష్టపోయిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు నగరికి వచ్చిన ఆయన బహిరంగ సభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా పనిచేసిన తననే ముందస్తు నోటీసు కూడా లేకుండా అర్ధరాత్రి అరెస్ట్ చేసి జైల్లో పెట్టారంటే ఇక సామాన్యుడు గతి ఏమిటని ప్రశ్నించారు. చెడు చేసిన వ్యక్తులను గుర్తు పెట్టుకోవాలని తద్వారా మంచి ఎలా చేయాలో తెలుస్తుందని అన్నారు. గత అయిదేళ్లలో రాష్ట్రంలో అవినీతి, అసమర్ధత రాజ్యమేలిందన్నారు. మిత్రుడు పవన్ కల్యాణ్ తాను కలిసి పోరాడామని, నరేంద్ర మోడి సహకారంతో చరిత్రలో ఎన్నడూ లేని విజయాన్ని సాధించామని తెలిపారు. పట్లాదారు పాస్ పుస్తకాలపైన, ఆఖరికి సర్వే రాళ్ల పైన జగన్మోహనరెడ్డి తన ఫోటో ముద్రించుకుని రూ. 700 కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని తెలిపారు. ప్రజల ఆస్తులకు సంబంధించిన పత్రాలపై తన ఫోటో వేసుకుని తమ ఆస్తులు తమకు దక్కుతాయో లేదోననే భయభ్రాంతులకు ప్రజలను లోను చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక రాజముద్రతో కూడిన పట్టదారు పాస్ పుస్తకాలను ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల కొత్తగా తనను క్రెడిట్ చోరీ అంటున్నారని, అసలు క్రెడిటే లేని వైసిపి నాయకులు క్రెడిట్ చోరీ అంటూ మాట్లాడడం హాస్యాస్పదంగా వుందన్నారు. రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపామన్నారు.

**కుప్పం తరహాలో నగరి అభివృద్ధి**

నగరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కంచుకోట లాంటిదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కుప్పం నియోజకవర్గం తరహాలోనే నగరిని కూడా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. నగరి అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే భానుప్రకాశ్‌కు అండగా వుంటానన్నారు. నగరి ప్రజల కోసం దివంగత గాలి ముద్దుకృష్ణమనాయుడు పరితపించేవారని, రాత్రింబవళ్లు పనిచేసే వారని గుర్తు చేశారు. స్వర్గీయ ఎన్టీఆర్ పిలుపు మేరకు ఆయన రాజకీయాల్లోకి వచ్చారని తన చివరి శ్వాస వరకూ ఆదర్శవంతంగా పనిచేశారని కొనియాడారు. తన తండ్రిని స్ఫూర్తిగా తీసుకుని మరింత మెరుగ్గా భానుప్రకాశ్ పనిచేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల నాటికి కృష్ణా జలాలను నగరికి తీసుకువస్తానన్నారు. విజయపురం మండలంలోని కోసలనగరం ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తే స్థానికులకు ఇక్కడే ఉపాధి లభిస్తుందని తెలిపారు. పుత్తూరు, నగరి మునిసిపాలిటీల్లో పారిశుధ్యం, మురుగునీటి శుద్ధి వంటి అంశాలకు సంబంధించి సహకారం అందించి రెండు మునిసిపాలిటీలను పరిశుభ్రంగా మారుస్తానని తెలిపారు.

**ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు**

నగరి పట్టణంలో శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్రలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బహిరంగ సభ వేదిక వద్ద ఏర్పాటు చేసిన వ్యవసాయాధారిత స్టాళ్లను పరిశీలించారు. పలు ప్రారంభోత్సవాలు చేశారు. వ్యర్ధాల సేకరణకు ఏర్పాటు చేసిన స్వచ్ఛ రధాలను ప్రారంభించారు. స్టాళ్లలోని మెప్మా, డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. నగరిలో అమృత్ 2.0 కింద రూ. 20.13 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. నగరి మునిసిపాలిటీలోని మంచి నీటి సరఫరా పథకం మెరుగుదలకు రూ. 13.96 కోట్లు, కాలనీ ప్రాంతాలకు నీటి సరఫరా, మౌలిక సదుపాయాల కోసం రూ. 3.97 కోట్లు, నగరి మునిసిపాలిటీ పరిధిలోని సాయిబాబా ఆలయ సమీపంలో వున్న సురగుంట చెరువు పునరుద్ధరణకు రూ. 2.20 కోట్లు విలువ చేసే పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు.

## విద్యారంగం అభివృద్ధికి
# మంత్రి లోకేష్ చర్యలు
### ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వవిప్‌డా॥ కంచర్ల, వైస్‌చాన్సలర్ ప్రొ.దొరస్వామి తదితరులు

కుప్పం, జనవరి24 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో రాష్ట్ర విద్య,ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి చర్యలు చేపట్టారని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం ద్రవిడ వర్సిటీలో జరిగిన వికసిత్ భారత్ 2047లో గ్రంథాలయాల పాత్ర జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విశ్వవిద్యాలయాలు విద్యావేత్తలను మలచుతాయని, అలాగే గ్రంథాలయాలు మేథాసంపత్తి నిలయాలుగా పేరుగడించాయన్నారు. ప్రపంచం నేడుడిజిటల్ టెక్నాలజీ దిశగాఅడుగులు వేస్తోందని అందుకు తగిన రీతిలో గ్రంథాలయాలు కూడా ఆధునీకరణతో పాటుడిజిటలైజేషన్ వైపు ముందుకుసాగాల్సిన అవసరం ఉందన్నారు. ద్రవిడ విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయం బాగుందని ప్రశంసించారు. గ్రామీణ, పట్టణ విద్యార్థుల మధ్య డిజిటల్ అంతరాన్ని తగ్గించడంలో గ్రంథాలయాలు ప్రధాన సాధనంగామారుతాయన్నారు. ద్రవిడ వర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు చేపడుతోందన్నారు. అనంతరం ఆచార్య గణేషన్ రచించిన తమిళ పుస్తకాన్ని డా॥ శ్రీకాంత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్‌ఛాన్సలర్ ఆచార్య ఎం. దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, డీన్ అక్యుటర్ బాబు, ప్రొఫెసర్లు సురేంద్రబాబు, శ్రీనివాసరాఘవన్, కిషోర్,

## జీరో గ్యాప్ శానిటేషన్ ముందడుగు



తిరుపతి హెల్త్, జనవరి 24, ప్రభాతవార్త
స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎస్వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవి ప్రభు ఆధ్వర్యంలో నిర్వహించారు. తజీరో గ్యాప్ శానిటేషన్ ఆంధ్ర థీమ్‌తో ముందడుగు వేసామన్నారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రాంగణంలో మెరుగైన పారిశుద్ధం కొరకు ప్రతి ఒక్క వైద్య విద్యార్థులు వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం జీరో గ్యాప్ శానిటేషన్ ఆంధ్ర థీమ్ అనే అవగాహన కార్యక్రమంలో వైద్య విద్యార్థులు, వైద్యులు, వైద్య అధ్యాపకులు, వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గత సంవత్సరం జనవరి నుంచి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛంధ స్వర్ణ ఆంధ్ర కాంపెయిన్ కార్యక్రమాలను జరుపుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక వైద్య విభాగ విద్యార్థుల చేత జీరో సానిటేషన్ గురించి ప్రతి ఒక్కరికి తెలుగులో ప్రసంగించిన వైద్య విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు ద్వారా వైద్యులు, వైద్య విద్యార్థులు, పరిసరాలు పరిశుభ్రం చేసుకోవడం పనులు చేపట్టారు. ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డా. డి.ఎస్.ఎన్ మూర్తి, డాక్టర్ సిరిగిరి సునీత, సామాజిక వైద్య విభాగ అధిపతి, తిరుపతి జిల్లా ఏపీఎన్జీవోస్ అధ్యక్షులు ఎస్. సురేష్ బాబు, కోశాధికారి ఎం.శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఏటుకూరి గిరిబాబు, వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు, పారిశుద్ధ్య కార్మికులు, ఎస్ వి వైద్య కళాశాల పిఆర్‌ఓ వీర కిరణ్ తదుతరులు పాల్గొన్నారు.

### స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్రతో
# తిరుపతి మరింత పరిశుభ్రత
### -కార్మికులకు రక్షణ కవచాలు పంపిణీ





తిరుపతి, జనవరి 24ప్రభాతవార్త:
రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి నాల్గవశనివారం చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రతో తిరుపతి నగరం మరింత పరిశుభ్రంగా మారుతుందని నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర,స్వచ్ఛాంధ్రలో భాగంగా తిరుపతిలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పారిశుధ్యపనులు చేస్తున్న కార్మికులకు రక్షణ కవచాలు (పిపిఈ కిట్లు)కమిషనర్ మౌర్య, తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డితో కలసి పంపిణీ చేశారు. ఈ ర్యాలీలో పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఎం.సుగుణమ్మ, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర, దూది కుమారి, టిడిపి నాయకులు శ్రీధర్‌వర్మ, వూకా విజయకుమార్, కరాటే చంద్ర, అదనపు కమిషనర్ శారదాదేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఆర్‌ఓ సేతుమాధవ్, ఆరోగ్య అధికారి డాక్టర్ యువఅన్వేశ్, నగరపాలకసంస్థ ఉద్యోగులు,కార్మికులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో విదేశీ వాణిజ్యంపై సదస్సు







సత్యవేడు, జనవరి 24 ప్రభాతవార్త:
ఆదర్శ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఏసీసీఐ), విదేశీ వాణిజ్యంపై అవగాహన సదస్సు శ్రీసిటీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల సీనియర్ ఉద్యోగులు, బ్యాంకింగ్ నిపుణులు, వాణిజ్య సలహాదారులు పాల్గొని ఎగుమతి ఫైనాన్స్, నియంత్రణల అనుసరణ, గ్లోబల్ మార్కెట్ దోరణులపై విస్తృతంగా చర్చించారు. ఏసీసీఐ ఉపాధ్యక్షుడు వి.వి.సంపత్‌కుమార్ సదస్సు ఉద్దేశ్యాలను వివరించడంతో పాటు అతిథులను పరిచయం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రసంగంలో ఎగుమతి ఆధారిత పారిశ్రామిక వృద్ధికి శ్రీసిటీ కీలక కేంద్రంగా మారుతోందని తెలిపారు. ఈ సెమినార్‌లో పలువురు ప్రముఖ బ్యాంకింగ్ నిపుణులు ప్రసంగించారు. ముత్తూట్ ఫిన్‌కార్ప్ వైస్ ప్రెసిడెంట్ నరేష్ వేముల సప్లయ్ చైన్‌ఫైనాన్స్‌పై మాట్లాడగా, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం హర్ప్రీత్ సింగ్ ఎగుమతి ఫైనాన్స్ అంశాలను వివరించారు. అదే బ్యాంకు ఈ సీసీబీ విభాగం ఏజీఎం ఆనంద్‌ప్రకాష్‌ఎగుమతి దిగుమతులకు సంబంధించిన బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈఎక్స్‌ఐఎం గ్రూప్ డైరెక్టర్ ఆర్.ఆర్.పద్మనాభన్, ఆర్‌బీఐ నియంత్రణల ఆచరణ గురించి వివరించారు. చార్టర్డ్ అకౌంటెంట్ గోపాలకృష్ణరాజు విదేశీ వాణిజ్య విధానం, పన్నుల వ్యవస్థపై స్పష్టతనిచ్చారు. ప్రశ్నోత్తరాలు, జ్ఞాపికల ప్రదానం అనంతరం ఏసీసీఐ కార్యదర్శి పి.నందగోపాల్ వందన సమర్పణతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# అమ్మణ్ణి ఆశీస్సులు ఎవరికో!
### - వర్గ పోరుతో బోర్డు నియామకానికి అడ్డంకులు



సూళ్లూరుపేట, జనవరి 24 ప్రభాతవార్త
తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్యదైవమైన శ్రీచెంగాళ మాత పరమేశ్వరిదేవి దేవస్థానానికి కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయినప్పటికీ ట్రస్టు బోర్డు నియామకానికి నోచుకోలేదు. కొంతవరకు కోర్టు సమస్యలు, మరోవైపు వర్గ పోరుతో అత్యంత ప్రాధాన్యత కలిగిన శ్రీచెంగాళమ్మ దేవస్థానానికి ట్రస్టుబోర్డు ఇప్పటివరకు ఏర్పాటు కాలేదు. ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ ఆశీస్సులు, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చొరవతో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత తిరుమూరు సుధాకర్‌రెడ్డికి ట్రస్టుబోర్డు ఛైర్మన్ పదవి ఇవ్వాలని పార్టీ అధిష్టానానికి సిఫార్సు చేశారు. అలాగే సూళ్లూరుపేట ప్రాంతంలో శ్రీచెంగాళమాత పరమేశ్వరి దేవి దేవస్థానానికి 30 సంవత్సరాలు ఛైర్మన్లుగా పనిచేసి, ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించిన వేనాటి కుటుంబానికి ఈ పదవి రావాలంటూ తిరుపతి జిల్లా పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి అధిష్టానానికి తన సోదరుడు వేనాటి సురేష్‌రెడ్డి పేరును సూచించారు. అప్పటి నుంచి కోర్టు అభ్యంతరాలు, మరోవైపు నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో ట్రస్టుబోర్డు నియామకానికి గ్రీన్ సిగ్నల్ లభించలేదు. కాగా, ప్రస్తుతం వినిపిస్తున్న సమాచారం మేరకు ఫిబ్రవరి మొదటి వారంలో ట్రస్టుబోర్డు నియామకం జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గత 12 సంవత్సరాలుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగాఉంటూ వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్న వేనాటి సతీష్‌రెడ్డి సోదరుడు వేనాటి సురేష్‌రెడ్డి అనూహ్యంగా శుక్రవారం జరిగిన మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకల్లో పాల్గొని అందరినీ ఆశ్చర్యచకితులను చేశారు. దీంతో సురేష్‌రెడ్డికి లైన్ క్లియర్ అయిందా అన్న అనుమానాలు పట్టణంలో వ్యక్తమవుతున్నాయి. పార్టీ కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండి నడిపించే వేనాటి సతీష్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో సురేష్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని తన చేతులు మీదుగా నిర్వహించినట్లు తెలిసింది. కానీ, వేనాటి సురేష్‌రెడ్డి రంగ ప్రవేశంతో ఒక్కసారిగా సూళ్లూరుపేట రాజకీయాల్లో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అధిష్టానం వేనాటి సురేష్‌రెడ్డి వైపే మొగ్గ చూపుతుందన్న ప్రచారంలో పట్టణంలో బాగా జరుగుతోంది. తిరుమూరు సుధాకర్‌రెడ్డి మాత్రం తనకు పార్టీ పెద్దల అండదండలు ఉన్నాయని, పదవి తనకు వస్తుందంటూ నమ్మకంగా ఉన్నారు. కానీ, చెంగాళమ్మ తల్లి ఆశీస్సులు ఎవరికో వేచి చూడాల్సిందే. మొత్తం తిరుమూరు సుధాకర్‌రెడ్డి వర్సెస్ వేనాటి సురేష్‌రెడ్డిలో విజేత ఎవరో అని ప్రతి ఒక్కరు పట్టణంలో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# ప్రారంభించకనే పెచ్చులూడుతున్న మార్చురి

### మార్చురి రంగులు ఘనం: పనులు అధ్వాన్నం




శ్రీకాళహస్తి,జనవరి 24 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో రూ.12కోట్టలో చేపట్టిన పనుల్లో భాగం మార్చురి నిర్మాణం. సుమారు ఐదేళ్ళ పాటు నత్తనడకన సాగిన పనులలో ఏ మాత్రం నాణ్యత లేదన్నది ఆసుపత్రిలోని మార్చురిని చూస్తే అవగతమౌతుంది. ఐదుకోట్లతో 1999లో పాతికేళ్ళు అయినా చెక్కుచెదరని నిర్మాణాలను చేపట్టి ప్రజలకు సేవలందిస్తుంటే వైకాపా పాలనలో తమ అనుచరుల కోసమే పనులు అన్నట్లు రూ.12కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. పనులు జరుగుతున్నప్పుడు పర్యవేక్షణ లేదు. రాష్ట్రంలో ఏ ఏరియా ఆసుపత్రిలోనూ లేని విధంగా ఒరెండవఅంతస్థును నిర్మించారు. లక్ష్యం మంచిదే. అయితే అది రోగులకు ఉపయోగపడి ఉంటే ప్రతి ఒక్కరు హర్షించాల్సిందే. కానీ శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి ఆవరణలో జరిగిన పనులన్నీ అస్తవ్యస్తమే.

**పెచ్చులూడున్న మార్చురి:**

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో మార్చురి అనేది ఎంతో ముఖ్యమైనది. నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. అంతేకాక పుణ్యక్షేత్రం కాబట్టి ఎక్కడెక్కడినుంచో వచ్చి ఇక్కడ తనువు చాలిస్తుంటారు.అలాంటి శవాలను మార్చురిలో భద్రతపరాల్సి ఉంటుంది. ఇందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది.ఈ నేపథ్యంలో ఇక్కడ మార్చురి ఏర్పాటు చేసారు. అయితే దానిని ప్రారంభించనే లేదు.అప్పుడే మార్చురికి అతికించిన టైల్స్ ఊడిపడిపోయి ఉన్నాయి. అంతేకాక లోపల కూడా పనుల్లో నాణ్యత లేదని తెలుస్తుంది. ఈ సమస్యను గుర్తించిన ప్రస్తుత శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చారు. కానీ ప్రయోజనం లేదు. పాత మార్చురి బాగా లేదని కొత్తది నిర్మించమంటే నాణ్యత లేకుండా నిర్మించి చేతులు దులుపుకున్నారు.

**సూపరింటెండెంట్ వివరణ:**

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో ఉన్న మార్చురి దుస్థితికి సంబంధించి ప్రభాతవార్త ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణను వివరణ కోరగా మార్చురి నిర్మాణానికి సంబంధించి పెచ్చులూడుందని ఏ సమయంలో కూలుతుందో అంతుపట్టకుందని తాము ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చామని వారు. కాంట్రాక్టర్ దగ్గర మళ్ళీ కట్టిస్తామని చెప్పారన్నారు. పనుల్లో నాణ్యతకు సంబంధించి ప్రశ్నించగా నాణ్యత గురించి తాను ఏమి చెప్పగలనన్నారు.

## పేదల పక్షపాతి ఎమ్మెల్యే గురజాల

**గుడిపాల, జనవరి 24 ప్రభాతవార్త:**



పేదల పక్షపాతి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అని మండల తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదినం పురస్కరించుకుని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మండలంలోని 27 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ళను అందజేశారన్నారు. ఎమ్మెల్యే గత రెండు సంవత్సరాలుగా ఎంతో మంది పేద విద్యార్థులకు సైకిళ్ళు, క్రీడా పరికరాలు అందించి ఉదారత చాటుకున్నారన్నారు. అలాగే పేదల జీవనం కోసం వారికి ఉచితంగా త్రోపుడు బండ్లను అందజేశారని, వీటితో నిరుపేదలు జీవనం సాగిస్తున్నారన్నారు.

## సిఎన్ఆర్ కళాశాలలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు



**గుడిపాల, జనవరి 24 ప్రభాతవార్త:** మండలంలోని సిఎన్ఆర్ కళాశాలలో శనివారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సంఘుల్ హైక్, కళాశాల అధినేత లోకేష్‌లు మాట్లాడుతూ అందరికి ప్రాణం అతి విలువైనదని, హెల్మెట్, సీటు బెల్టు లేకుండా మితిమీరిన వేగంతో నిర్లక్ష్యంగా డ్రైవ్ చేయడం ప్రమాదకరమన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడుపరాదన్నారు. ఒక కుటుంబంలో పెద్ద మృతి చెందితే ఆ కుటుంబం మొత్తం వీధిన పడే అవకాశం వుంటుందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనంను డ్రైవ్ చేయరాదని, ట్రాఫిక్ నియమాలు పక్కాగా పాటించి వాహనాలను నడుపాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాంటే కారు లిమిటెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్, సేఫ్టీ ఇన్‌ఛార్జీ ముఖేష్‌కుమార్ గుప్తా, బోలేందర్ సింగ్, కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి అర్జున్, అధ్యాపకులు మీనాకుమారి, రంజిత్‌కుమార్, రేవతి, ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యూరియా పంపిణీలో పక్షపాతం ధోరణి

**చిత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త:**



యాదమరి మండలంలో యూరియా పంపిణీలో సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని పేరకూరు గొల్లపల్లి సచివాలయ పరిధిలోని రైతులు ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం రైతులు మాట్లాడుతూ గ్రామ సచివాలయ పరిధిలో వ్యవసాయ అధికారులు అధికార పార్టీకి చెందిన వెంకటేష్ అనే వ్యక్తి చెప్పిన వారికి మాత్రమే యూరియా పంపిణీ చేస్తున్నారని, మిగిలిన వారికి యూరియా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ విషయంను వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం లేదన్నారు. ఇకనైనా వ్యవసాయ అధికారులు రాజకీయ పార్టీలకు అతీతంగా పంటలు సాగు చేసిన నిజమైన అర్హులైన రైతులకు యూరియా అందించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతులు గోపి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవ ర్యాలీ



**యాదమరి, జనవరి 24 ప్రభాతవార్త:** యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ సమాజంలో బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రభుత్వం బాలికల సంరక్షణకు పక్కాగా చర్యలు తీసుకుంటోందని, అలాగే బాలికల తల్లిదండ్రులు సైతం వారి సంరక్షణకు నడుంబిగించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి స్సిబంది, ప్రజలతో డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ శ్రీనివాసమూర్తి, హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మీపతి, సెల్వరాణిలు, పబ్లిక్ హెల్త్ నర్స్ నిర్మలమ్మ, ల్యాబ్ టెక్నిషియన్ పితాంబరి, ఫార్మసిస్టు శైల, ఎంఎల్‌హెచ్‌పిలు దుర్గాప్రసన్న, భానుమతి, లోకేశ్వరి, దివ్య, దిల్షాద్, సుస్మిత, ఎఎన్ఎంలు శిల్ప, కళ్యాణి, సరిత, ప్రేమ, భాగ్యమేరి, సరస్వతి, మేల్ హెల్త్ అసిస్టెంట్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియు నూతన కార్యవర్గం

**బంగారుపాళ్యం, జనవరి 24 ప్రభాతవార్త:**

మండల పిఆర్‌టియు నూతన కార్యవర్గం శనివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎన్నికలను నిర్వహించారు. మండల పిఆర్‌టియు శాఖ అధ్యక్షులుగా రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, మహిళా ఉపాధ్యక్షురాలుగా పార్వతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా స్వామివేలు, వైస్ ప్రెసిడెంట్‌గా తులసీరామ్, అసోసియేట్ అధ్యక్షులుగా దేవకుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా పద్మనాభరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రమేష్, కృష్ణయ్యలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేంద్రరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సురేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం, ఎన్నికల అధికారిగా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకచ్చారిలు వ్యవహరించారు. అలాగే మండల గౌరవ అధ్యక్షులుగా రామలింగారెడ్డి ఎంపికయ్యారు.

ఎ

## సీనియర్ జర్నలిస్ట్ మృతికి పలువురు సంతాపం

**సోమల జనవరి 24 (ప్రభాతవార్త)** సోమలకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ మొగసాల కృష్ణమూర్తి (54) అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందాడు. పలు పత్రికల్లోనూ , ఎలక్ట్రానిక్ మీడియాలోనూ పనిచేసే విశేష ప్రతిభ కనబరిచాడు. ఆయనకు భార్య కూతురు కుమారుడు ఉన్నారు. ఆయన మృతి పట్ల పుంగనూరు నియోజకవర్గ జర్నలిస్టు సంఘాలు పలువురు రాజకీయ నాయకులు సంతాపం ప్రకటించారు. జర్నలిస్టులు ఆయన మృతికి సంతా పం ప్రకటిస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థిక సాయం అందించారు. ఆయన అం త్యక్రియలు ఆదివారం ఉదయం పది గంటలకు సోమలలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## బాలికలకు అన్ని రంగాలలో సమాన అవకాశాన్ని కల్పించాలి:

**శ్రీకాళహస్తి రూరల్ (ఏర్పేడు) జనవరి 24 ప్రభాతవార్త** ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పేడు మండలం ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరియు కొత్తవీరాపురం ఎస్సీ కాలనీలో జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ కో ఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ పురాతన కాలం మొదలు ప్రస్తుత యుగం వరకు పురుషాధిపత్య సమాజంలో బాలికలు వివక్షకు గురి అవుతున్నారన్నారు. అబ్బాయికి ప్రయివేటు విద్య, అమ్మాయికి ప్రభుత్వ అనేది అన్నీ ప్రాంతాలలో మనకు కనిపించే మరొక రకమైన వివక్ష. ఈ జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మీ అందరికీ విన్నవించు కోవడం ఏమనగా అమ్మాయిలను చదవనిద్దాం. ఎదగనిద్దాం. లింగ వివక్షను రూపుమాపడానికి మనమందరం కలిసి ప్రతిజ్ఞబూనుదాం అని పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయురాలు మునిలక్ష్మి గారి ఆధ్వర్యంలో బాలికల దినోత్సవం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతి రత్నమ్మ మాట్లాడు తూ, ఆడపిల్ల చదువు కుటుంబ అభివృద్ధి కాక సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పడం జరిగిం ది. అంగన్వాడి వర్కర్లుఆశావర్కర్లుసచివాలయసిబ్బందిపిల్లలు, ప్రగతి సంస్థ సిబ్బందిగ్రామస్తులు పాల్గొన్నారు.

## వి.కోటలో ఉపాధి పనులపై విచారణకు ఆదేశం

**వి.కోట, జనవరి 24 ప్రభాతవార్త**

స్థానిక చెరువులో ఉపాధిపనులు చేపట్టినట్లు బిల్లులు పొందుపరచిన ఉపాధిహామీ టిఎలు, ఎఫ్ఎలకు నోటీసులు జారీ చేయడంతో పాటు విచారణకు ఆదేశించినట్లు ఎంపిడిఓ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ విషయంగా ఇటీవల 'వార్త'లో కథనం వెలువడిన విషయం పాఠకులకు విదితమే. నవంబర్ 10నుంచి జనవరి 14వతేది వరకు జరిగిన తొమ్మిది పనులకు సంబంధించి తగు వివరణ ఇవ్వడంతో పాటు చెరువులో నీళ్లు ఉన్నప్పుడు 21లక్షల దాకా పేమెంట్లు ఎందుకు చేశారో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

## బాలికలు చట్టాలపై అవగాహన కలిగివుండాలి



**– జిల్లా సీనియర్ సివిల్ జడ్జీ భారతి**

**చిత్తూరురూరల్, జనవరి 23 ప్రభాతవార్త:**

బాలికలు చట్టాలపై అవగాహన కలిగివుండాలని, అలాగే సోషల్‌మీడియా ద్వారా ఫేస్‌బుక్, ట్విట్టర్ లాంటి చాటింగ్ యాప్‌లలో అప్రమత్తంగా వుండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్‌జడ్జీ ఎంఎస్ భారతి తెలిపారు. శనివారం కొంగారెడ్డిపల్లెలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 19వ జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమంను హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బాల్యవివాహాలను అరికట్టాలని ఫోక్సో చట్టంపై ప్రతిబాలిక తెలుసుకోవాలని, బాలికలకు సమస్యలు ఎదురైనప్పుడు 1098కు కాల్ చేయాలని తెలిపారు. అనంతరం క్రీడలు, యోగా తదితర రంగాల్లో రాష్ట్రస్థాయిలో గెలుపొందిన బాలికలకు హ్యూమన్ రైట్స్‌ఆధ్వర్యంలో మెమోంటో, ప్రసంశాపత్రాలను జడ్జీ చేతుల మీదుగా అందజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రాజేంద్రప్రసాద్, వన్‌టౌన్ సిఐ మహేశ్వర్, సిడిపిఒ శ్యామ్ సుగుణకుమారి, జిల్లా విజిలెన్స్ మోనిటింగ్ కమిటీ సభ్యులు శ్రీరంగపల్లి మునస్వామి, హెచ్‌ఆర్ పిసి జిల్లా అధ్యక్షులు రమేష్‌బాబు, ఎంఈఓ మోహన్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ, ఐసిడిఎస్ సూపరింటెండెంట్ కవితలతో పాటు హెచ్‌ఆర్‌సిపి సభ్యులు కిషోర్, దాము, రాజారమేష్‌బాబు, దుర్గ కుమారి, ప్రియాంక, దేవరాజులు, రూపేష్‌రెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు దిశ యాప్‌పై అవగాహన అవసరం



**పుంగనూరు. జనవరి 24 ప్రభాతవార్త**

ఆరవ తరగతి నుంచి విద్యార్థినిలు తమ కుటుంబీ కులకు చెందిన ఫోన్లో దిశ యాప్ ఉపయోగించడంలో అవగాహన కలిగి ఉండాలని పారా లీగల్ వాలంటీర్ మరియు ప్రధాన ఉపాధ్యాయులు సూచించారు. శనివారం ఎన్ఎస్పేట ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మహిళల సంరక్షణ బాలికల సంరక్షణ బాలికల సంరక్షణ పై చట్టాలు అవగాహన అంశాలను గురించి పిల్లలకు వివరించారు. స్థానిక సీరియల్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తులు న్యాయ సిబ్బంది వారి సహకారంతో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో పలువురు మహిళ ఉపాధ్యాయులు మాట్లాడుతూ బాలికలకు మహిళలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన చట్టాలను గురించి పూర్తిగా వివరించారు. కార్యక్రమంలో మహిళ ఉపాధ్యాయులు బాలికలు పాల్గొన్నారు.

## దళిత మహిళను అవమానించిన పూజారుల పైన చర్య తీసుకోవాలి

**పుంగనూరు జనవరి 24 ప్రభాతవార్త**



కర్నూలు జిల్లాలో దళిత మహిళకు జరిగిన అవమాన ఘటనలో బాధ్యులపై వెంటనే చర్య తీసుకోవాలని ఏపీ రాష్ట్ర దళితుల సంక్షేమ సేవా సంఘం డిమాండ్ చేసింది. కెమెరాకు సంఘ అధ్యక్షుడు శంకరప్ప ఆధ్వర్యంలో స్థానిక సీఐ సుబ్బరాయుడు కు వినతిపత్రం అందజేశారు. కర్నూలు జిల్లా. ఓర్వకల్ మండలం సోమయాజులపల్లిలో. గ్రామ దేవత సుంకులమ్మ గుడి పూజారులు బలిజి జనార్ధన్, వంశీలు అదే గ్రామానికి చెందిన దళిత మహిళ మాలతి ను కులం పేరుతో దూషించి గుడిలోకి ప్రవేశించరాదని అడ్డుకున్నారని ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

## బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

**– డా॥ హరిత సురేష్**

**కుప్పం, జనవరి 24 ప్రభాతవార్త**



బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డా॥ హరిత సురేష్ పేర్కొన్నారు.జాతీయ బాలికలదినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాసాధికారసంస్థ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల చట్టపరమైన హక్కులు, ఆరోగ్యవిషయాలు, లింగసమానత్వం యొక్క ప్రాధాన్యత, బాలికా సంరక్షణ చట్టాల గురించి వివరించారు. బేటీ బచావో బేటీ పడావో నినాదానికి అనుగుణంగా ఈ కార్యక్రమం నిలిచింది. కార్యక్రమంలో మండల లీగల్ సర్వీస్ సభ్యుడు రాజా, న్యాయవాది అమర్‌నాథ్, కుప్పం పారాలీగల్ వాలంటీర్లు మహేష్ అంబా, పిజి సెల్వం, సెంధిల్, చరణ్, జయరాంనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులు దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి

**గుడుపల్లె, జనవరి 24 ప్రభాతవార్త**



న వ యా జ ం లో వి ద్యా ర్థు లం దుర వ్యసనాలకు దూరంగా ఉండాలని రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ సూచించారు. శనివారం శెట్టిపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఆయన విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు విద్యపై మక్కువ చూపాలన్నారు. అలాగే క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు సెల్‌ఫోన్లను మితంగావాడితే ఎంతో మంచిదని సూచించారు.నైతిక విలువలపై అవగాహన పెంచుకోవడం పాటు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పాడి రైతులకు అండగా సిఎం చంద్రబాబు



**ప్రభుత్వవిప్ డా॥ కంచర్ల శ్రీకాంత్**

**కుప్పం, జనవరి24 ప్రభాతవార్త**

సిఎం చంద్రబాబునాయుడు కుప్పం ప్రాంత పాడి రైతులకు అండగా నిలుస్తున్నారని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం స్థానిక లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించ నున్న గోకులంషెడ్ల నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో పాడి రైతుల సౌకర్యార్థం రైతులకు గోకులం షెడ్లను మంజూరు చేయడం జరుగుతోందన్నారు.ఇందులో రైతులకు రాయితీ సైతం లభిస్తోందన్నారు. ఇప్పటికే నియోజకవర్గానికి ఐదువందలకు పైగా గోకులం షెడ్లను సిఎం చంద్రబాబుమంజూరు చేశారన్నారు. మున్సిపాలిటీలో సైతం సుమారు అరవైమంది రైతులకు లబ్ది కలుగుతోందన్నారు. ఇప్పటికే రైతుల పాడి ఆవులకు లింగ నిర్ధారిత వీర్యంను ఉచితంగా పైలట్ ప్రాజెక్టు కింద వేయడం జరుగుతోందన్నారు. తద్వారా ఆవులు పేయదూడలకే జన్మనిస్తాయన్నారు. కుప్పంలో ప్రస్తుతం నాలుగు లక్షల దాకా ఉన్న పాల ఉత్పత్తిని పది లక్షల లీటర్లకు చేర్చేలా సిఎం చంద్రబాబు పాడి రైతులకు భరోసా కల్పిస్తునా న్నరన్నారు. కార్యక్రమంలో పికెఎంఉడాఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ ఛైర్మన్ సెల వ్వరాజ్, మాజీ ఛైర్మన్‌డా॥ సుధీర్,మున్సిపల్ టిడిపి అధ్యక్షుడుకాణిపాకం వెంకటేష్, కడ సభ్యుడు రాజ్‌కుమార్, నేతలు రవి, నారాయణ, లోకేష్, కౌన్సిలర్ జిమ్‌దాము,క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, రెస్కో డైరెక్టర్లు ఆర్ముగం, శివతేవర్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న ఆర్టీఐ కమీషనర్

**కాణిపాకం,జనవరి 24 ప్రభాతవార్త:**



రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమీషనర్ ఒంటేరు రవిబాబు శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు.అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.ఇదిలా వుండగా దేవస్థానం అతిథి గృహంలో ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌లు ఆర్టీఐ కమీషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ వాసు, కాణిపాకం ఎస్సై నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రెండు లక్షలు విరాళం

**కాణిపాకం, జనవరి 24 ప్రభాతవార్త:**





కాణిపాకం శ్రీవరసిద్ది వినా యక స్వామివారి దే వస్థా నంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు రెండు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తవణంపల్లె మండలం మైనగుండ్లపల్లెకు చెందిన సు బ్రమణ్యంరెడ్డి, ఐరాల మండల చింతగుమ్మలపల్లెకు రెడ్డి లోకేష్‌లు వేర్వేరుగా 1,01,116 రూపాయలు వంతున శాశ్వత నిత్యాన్నదాన పథకంకు విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ వాసులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో టెంపుల్ ఇన స్పెక్టర్ రవి, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## సమగ్ర సస్యరక్షణతోనే అధిక దిగుబడి

**తవణంపల్లె,, డిసెంబర్ 24 ప్రభాతవార్త:**

మామిడి పంటకు సమగ్ర పోషక, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను అవలంభించడం ద్వారా చీడ పీడలను సమర్థవంతగా నివారించి అధిక దిగుబడి సాధించవచ్చునని కెవికె.శాస్త్రవేత్త సుధాకర్ అన్నారు.శనివారం మండలంలోని అరగొండ శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో కరకంబాడి రాస్ విజ్ఞానకేంద్రం, కోకోకోలా ఇండియా లిమిటెడ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మామిడిలో సమగ్ర పంట యాజమాన్యంపై మండలంలోని మామిడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మామిడి పూత ఒకే సారి రావడానికి,మామిడి పంట పూత పిందు దశలో సోకే వివిధ రకాల తెగుళ్ళు వాటి సస్యరక్షణ చర్యలు వంటి వాటి గురించి రైతులకు వివరించారు. ఈకార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, సుధాకర్, అనిల్‌కుమార్, ఉద్యాన అధికారిణి డి.సాగరిక,వ్యవసాయాధికారిణి వందన, రాస్ సిబ్బంది సాయిచంద్రబాబు, నీరజ్,చిత్తూరు మామిడి ఎఫ్‌పీఓ ఛైర్మన్ కుమార్‌స్వామినాయుడు, స్థానిక సర్పంచ్ మల్లుదొరై. అరగొండ సింగల్ విండో ఛైర్మన్ రంజిత్‌రెడ్డి, మండలంలోని మామిడి రైతులు పాల్గొన్నారు.



## నేడు జాతీయ ఓటరు దినోత్సవం : తహశీల్దార్

**కుప్పం, జనవరి 24 ప్రభాతవార్త**

జాతీయ ఓటరు దినోత్సవంను ఆదివారం కుప్పంలో నిర్వహి ంచనున్నట్లు తహశీల్దార్ చిట్టిబాబు తెలిపారు. ఈసందర్భంగా కుప్పం బస్టాండులో మానవహారం, ర్యాలీ కార్యక్రమాల అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఓటరు దినోత్సవం నిర్వహించడం జరుగుతుందనిచెప్పారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న టువీలర్.. తప్పిన ప్రమాదం

**కుప్పం, జనవరి 24 ప్రభాతవార్త**

కుప్పం – కృష్ణగిరి జాతీయ రహదారిలో ఓ టువీలర్ ముందువెళ్తున్న ఓటువీలర్‌ను ఢీకొని అనంతరం ఆర్టీసీ బస్సును ఢీకొంది. అయితే ఈ సంఘటనలో ప్రమాదం తప్పింది. టువీలర్‌లో వచ్చిన యువకులు స్వల ్పగాయాలతోబయటపడినట్లు స్థానికులు తెలిపారు. వారిని హుటాహుటిన ఆంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని హెడ్ కానిస్టేబుల్ చక్రపాణి తెలిపారు.

## స్వచ్ఛతతోనే చక్కటి ఆరోగ్యం సాధ్యం

**కుప్పం, జనవరి 24 ప్రభాతవార్త**



పరిసరాలను శు భ్రంగా ఉంచుకుంటేనే చక్కటి ఆరోగ్యం సాధ్యమని కుప్పం ఏరియా ఆస్పత్రి ఇన్ చార్జ్ మెడికల్ సూపరింటిండెంట్ డా॥ విశ్వనాథ్ పేర్కొన్నారు. శనివార ం స్థానిక ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛా ంధ్ర కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ సిఎం చంద్రబాబునాయుడు మహోన్నత ఆశయంతో ఈ కార్యక్రమంకు పిలుపునిచ్చాం న్నారు. ప్రతినెలా మూడోశనివారం స్వచ్ఛ oదంగా ఈకార్యక్రమం చేపట్టడం జరుగుతోందన్నారు. ప్రజలు కూడా చెత్త చెదారాలను రోడ్లపై పడేయరాదని, ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలన్నారు. వీలైనంత ఎక్కువ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్ఎంఒ డా॥ గణపతి, వైద్యులు రమ్య, జయశ్రీ, నర్సింగ్ సూపరింటిండెంట్ తార, స్టాఫ్ నర్స్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాయితీ ఇ-సైకిళ్లను సద్వినియోగం చేసుకోవాలి

**శాంతిపురం, జనవరి 24 ప్రభాతవార్త**



సిఎం చంద్రబాబునాయుడు చొరవతో ప్రజలకు రాయితీతో అందిస్తున్న ఇ- సైకిళ్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ పిఆర్ కుమార్ కోరారు. మండలంలో ఇప్పటిదాకా ఇ –సైకిళ్లకు 723 రిజిస్ట్రేషన్లు చెల్లింపులు జరిగి జిల్లాలో ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగిన మండలంగా శాంతిపురం మొదటి స్థానంలో ఉందన్నారు. ఇప్పటివరకు 24వేలు మొత్తం చెల్లించిన వారు 295మంది కాగా 5వేల డిపాజిట్‌ను చెల్లించిన వారు 428మంది ఉన్నారన్నారు. ఒక్కో సచివాలయంకు ఒక్కో సైకిల్ రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. వీటితో పాటు మహిళా సంఘాల ద్వారా 30 సైకిళ్లను కొనుగోలు చేస్తున్నారన్నారు. ఫిబ్రవరి నెలనుంచి ఇ–సైకిళ్లను లబ్దిదారులకు అంది ంచనున్నట్లు చెప్పారు.

# రైల్వే కోడూరు డివిజన్

## ముగిసిన వారాహి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్..





**పెనగలూరు జనవరి 24 ప్రభాతవార్త**

రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలంలో జిల్లా ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహించిన వారాహి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం ఉత్సాహంగా జరిగింది. ఈ ఫైనల్ పోటీలో మనీ లెవన్స్ సాతుపల్లి జట్టు విజేతగా నిలవగా, సింగనమాల గ్రామానికి చెందిన మధు లెవన్స్ రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా విజేతలకు, రన్నరప్ జట్లకు కప్పులను ప్రభుత్వ విప్, రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్, రైల్వే కోడూరు నియోజకవర్గం టీడీపీ పార్టీ ఇంచార్జ్, కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి కుమారుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యతను పెంపొందిస్తాయి. గ్రామీణ స్థాయిలో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని" పేర్కొన్నారు. ..ముక్కా సాయి వికాస్ రెడ్డి మాట్లాడుతూ, యువతను సరైన దిశలో నడిపించే శక్తి క్రీడలకు ఉంది. గ్రామాల్లో ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడం వల్ల ఆరోగ్యం, ఐక్యత రెండూ బలపడతాయి." అని అన్నారు. ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన సభ్యులు యర్రంశెట్టి హరి బాబు రాయల్, కోడిదల సాయి కుమార్ మరియు ఆర్గనైజర్స్:గొబ్బూరు హరి, సచిన్,వెంకట్ ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తాతం శెట్టి నాగేంద్ర స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటగాళ్లను ప్రోత్సహించారు.

## పొలంలో ఫార్మ్ రోబోపై డెమో : ఏవో సందీప్.

**రైల్వే కోడూరు, జనవరి 24 ప్రభాతవార్త**



రైల్వే కోడూరు మండలం ఎస్ఆర్ కండ్రిక గ్రామంలో వెంకటరామరాజు పొలంలో ఫార్మ్ రోబో ఆర్ వన్ డెమో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వ్యవసాయ అధికారి సందీప్ తెలిపారు. రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి రూపొందించబడిన ఒక స్వదేశీ మల్టీపర్పస్ రోబోట్ అని ఆయన తెలిపారు. తద్వారా వ్యవసాయంలో కూలీల కొరతను అధిగమించడం, ఖర్చులను తగ్గించడం తదితర వాటిపై అవగాహన తెలియజేసినట్లు తెలిపారు. ఒకసారి బ్యాటరీ బ్యాకప్ చేస్తే దాదాపు మూడు నుంచి ఐదు గంటల వరకు నిరంతరాయంగా పనిచేస్తుందని అన్నారు. బహుళ ఉపయోగాలు, బ్లేడు, నాగలి, భూమి స్ప్రేయర్ మరియు మిస్సు డు బ్లోయర్ వంటి వివిధ రకాల పరికరాలను అమర్చుకోవచ్చని తెలిపారు. కోడూరు ప్రాంతంలో అరటి, బొప్పాయి, కూర తోటలు కాపాడుకోవడానికి అనుకూలత ఈ మిషన్ ద్వారా నిర్వహించవచ్చని వ్యవసాయ అధికారి సందీప్ తెలియజేశారు.

## స్వచ్ఛతకు శ్రీకారం చుట్టిన కోడూరు నాయకులు

**రైల్వే కోడూరు, జనవరి 24 ప్రభాతవార్త**



రైల్వేకోడూరు పట్టణంలో శనివారం స్వచ్ఛ రథం స్వచ్ఛతకు రైల్వే కోడూరులో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్వచ్ఛత కార్యక్రమాలకు మరింత ఊతమిస్తూ స్వచ్ఛ రథంను అధికారులతో కలిసి రైల్వేకోడూరు పట్టణంలో ప్రారంభించారు. ఎంపీడీవో జయశ్రీ మాట్లాడుతూ పూర్తిస్థాయిలో రైల్వే కోడూరు మండలాన్ని స్వచ్ఛత కార్యక్రమాలకు అందరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ముక్కా సాయి వికాస్ రెడ్డి మాట్లాడుతూ ఇంటింటా ఉత్పత్తి అయ్యే పొడి చెత్తను స్వచ్ఛ రథం ద్వారా సేకరించి పునర్ వినియోగానికి పంపడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పరిశుభ్రత పెరగాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ప్రతి కుటుంబం ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో గురు మోహన్, పోతురాజు నవీన్, హేమ రాజ్, మణి, క్లస్టర్ మోలా, భుజంగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ ఉంగరాల బ్రదర్స్, మండలంలో పనిచేస్తున్న గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## 26 స్విమ్స్ ఓ.పి, ఓటిలకు సెలవు

**తిరుపతి హెల్త్, జనవరి 24, ప్రభాతవార్త**శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) కు భారత 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26వ తేది సోమవారం ఓ.పి, ఓ.టి.లకు సెలవు దినంగా ప్రకటించారు. స్విమ్స్ అత్యవసర సేవలు యదాతథంగా కొనసాగుతాయని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్ ఒక ప్రకటనలో తెలియచేశారు.

## పేదలకు అన్నదానం...



**తిరుపతి కలెక్టరేట్, జనవరి 24 ప్రభాతవార్త** యాదవ సంఘం నేత, స్వర్గీయ బొడుగు యర్రయ్య పేరిట గత మూడు సంవత్సరాలుగా సామాజిక సేవా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి, ఏర్పేడు మండల టిడిపి బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, బి.ఎం.ఆర్ ట్రావెల్స్ అధినేత బొడుగు మునిరాజా యాదవ్ చెప్పారు. శుక్రవారం రామ తులసి కళ్యాణ మండపం రోడ్డు లోని బి.ఎం.ఆర్ ట్రావెల్స్ పార్కింగ్ ఏరియాలో స్వర్గీయ బొడుగు యర్రయ్య మూడవ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ఆయన కుమారుడు బొడుగు మునిరాజా యాదవ్ గజ పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం పేదలకు, నిరాశ్రయులకు యర్రయ్య పేరిట అన్నదానం చేశారు. అన్నదాన పంపిణీ కార్యక్రమంలో అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర యువజన అధ్యక్షులు శంకర్ యాదవ్, 7 ప్రొటెక్ ఐటీ సొల్యూషన్స్ చైర్మన్ గంగాధర్ యాదవ్, తిరుపతి ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షులు రూపేష్ కుమార్, జనసేన పార్టీ కార్యదర్శి సాయి దేవ్ యాదవ్, న్యాయవాది ఎంజి కుమార స్వామి యాదవ్, టిడిపి నాయకులు కేశినేని సుబ్రహ్మణ్యం, గురు చరణ్ యాదవ్, పూడి నాగరాజు యాదవ్, జిల్లా నలుమూలల నుండి వచ్చిన కూటమి నాయకులతోపాటు బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో పాటు యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## బాలికల భవిష్యత్తుకు భరోసా అవసరం



**శ్రీకాళహస్తి, జనవరి 24 ప్రభాతవార్త** బాలికల భవిష్యత్తుకు భరోసా అవసరమని ఉషోదయా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు చక్రాల ఉష అన్నారు. శనివారం జాతీయ బాలికాదినోత్సవం సందర్భంగాఆమె అంగన్‌వాడికేంద్రంలో విద్యాసామగ్రి పంపిణి కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. చిన్నారుల మధ్య ఆమె కేక్‌కట్ చేసి సంబరాలు జరిపారు. వారికి పలకలు, బలపాలతో పాటు నోటు పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఉషా సేవా కార్యక్రమాలకు సంబంధించి పలువురు మాట్లాడుతూ పండగలు, ప్రత్యేక దినోత్సవాల్లోనే కాకుండా నిరంతరం పేదల చెంతకు చేరుతూ తమ సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను కొనియాడారు. నిరుపేద విద్యార్థులకు వారి చదువులకు అండగా నిలవటం విద్యపట్ల ఆమెకు గల గుర్తింపుకు నిదర్శనం అన్నారు. ఉష మాట్లాడుతూ బాలికలకు పసి తనం నుంచి పౌష్టికాహారం, సరైన విద్య అందిస్తే వారికి జీవితం మీద అవగాహన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడి కార్యకర్తలు ఎస్‌కె రేష్మా, ఎన్.సుభాషిణి, సహాయకురాలు కె.సుప్రజ వ్యవస్థ సభ్యులు పాల్గొన్నారు.

## ఆత్మనిర్భర్ నిధి మూడో విడత చెక్కులు పంపిణి



**శ్రీకాళహస్తి, జనవరి 24 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పురపాలకసంఘం సమావేశం హాలులో శనివారం బొజ్జల బృందమ్మచే ప్రధాన మంత్రి వీది వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి చెక్కులను అందించారు. ఈ పథకంలో వీధి వ్యాపారుల అభివృద్ధికి మూడు విడతల్లో ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు సభకు అధ్యక్షత వహించిన మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ వివరించారు. మొదటి విడత రూ.15వేలు, రెండవ విడత రూ.25వేలు, మూడో విడతలో రూ.50వేలు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలకు బొజ్జల బృందమ్మ హాజరు కావటం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిధి బృందమ్మ మాట్లాడుతూ నిరుపేద వ్యాపారులను ఆదుకొనుటకు ఓ వైపు కేంద్రం మరో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను రూపొందించి అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆమె 'క్రెడిట్ కార్డులను' లాంచింగ్ చేసారు. 829 మంది పిఎంస్వానిధి లబ్ధిదారులకు రూ.1.58 కోట్లులు విడుదల చేసినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమాల్లో కమిషనర్ భవాని ప్రసాద్ మెప్మా జిల్లా అధికారి పి.వెంకటరమణ స్థానిక మెప్మా సిఓలు డి.దివాకర్, వినోద్, వెంకటలక్ష్మీ, కుమారి సంధ్యా తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల పాలిట పెన్నిధి హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు



**శ్రీకాళహస్తి, జనవరి 24 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా శనివారం దివ్యాంగులకు నెలకు సరిపడ్డ నిత్యావసర సరకులను అందించారు. సుమారు 15 సంవత్సరాలుగా మునీర్‌బాషా అనే సేవకుడు తన సంపాదనలో కొంత దివ్యాంగులకోసం కేటాయించి ప్రతి నెల అందిస్తున్నారు. ఒక్కొక్క కుటుంబానికి సుమారు రూ.5వేల విలువ చేసే సరకులను అందజేస్తున్నారు. అంతేకాక ఫ్రీబజార్‌పేరిట పేదలు నివసించే ప్రాంతానికి వెళ్ళి ఉచిత సామగ్రిని అందజేస్తూ పేదల ఆశీర్వాదాలను అందుకుంటున్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో సంస్థ అధినేత మునీర్‌బాషా, సభ్యులు గరికపాటి రమేష్, కోళ్ళూరు హరినాయుడు, హబీబ్‌బాషా, బాబాఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వైకాపా సాంస్కృతిక ప్రధాన కార్యదర్శిగా శివకుమార్



**శ్రీకాళహస్తి, జనవరి 24 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెం గ్రామానికి చెందిన శివకుమార్‌ను వైకాపా ఉమ్మడి జిల్లా సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించారు. శివకుమార్ శనివారం శ్రీకాళహస్తిలోని పార్టీ కార్యాలయంలో మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డిని కలిసి సత్కరించారు. తనకు ఇంత పెద్ద పదవి రావటానికి ప్రతిపాదించిన మధుసూధనరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ బోర్డు సభ్యుడు బుల్లెట్ జయశ్యాం రాయల్, సాధన మున్నారాయల్, మహదేవ్, రాము తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో కియోస్క్ కౌంటర్లు ఏర్పాటు

**శ్రీకాళహస్తి, జనవరి 24 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయానికి వస్తున్న భక్తుల సౌకర్యార్థం కరూర్ వైశ్యాబ్యాంకు మరో అడుగు ముందుకు వేసింది. శనివారం ఆలయ ప్రాంగణంలో కియోస్క్ కౌంటర్లను ఏర్పాటు చేసింది. ఇప్పటికే శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారుల ఆటకట్టించుటకు అధికారులు 8కౌంటర్లను ఒకే చోట ఏర్పాటు చేసారు. అయితే ఇక్కడ క్యూలైన్లలో నిలబడలేని భక్తులు సత్వరంగా సేవా టిక్కెట్లు తాము తీసుకునేలా కరూర్ వైశ్యాబ్యాంక్ ఎనిమిది చోట్ల కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసారు. వీటిని త్వరలో ప్రారంభించనున్నారు. దాంతో భక్తులకు ఇంకా సులభతరం కానుంది. ఈ యంత్రాలను శనివారం సాయంత్రం ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ప్రయోగాత్మకంగా పరిశీలించారు.

## మెడికల్ క్యాంపుల ద్వారా విశేష సేవలు



**తొట్టంబేడు జనవరి 24 ప్రభాతవార్త** గ్రీన్‌ప్యానెల్ ఫౌండేషన్ కార్పొరేట్ సామాజిక బాధ్యత(సి.యెస్.ఆర్ )కార్యక్రమాలలోని ఆరోగ్య సేవల ద్వారా ఐదు నెలల్లో ఐదు వేల మందికి పైగా లబ్ధిదారులమొబైల్ మెడికల్ క్యాంపుల ద్వారా విశేష సేవలు గ్రీన్‌ప్యానెల్ ఇండస్ట్రీస్ మద్దతుతో, గ్రీన్‌ప్యానెల్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న మొబైల్ మెడికల్ యూనిట్ (యమ్.యమ్.యూ ) సేవల ద్వారా గత 5 నెలల కాలంలో ఐదు వేల మందికి పైగా గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం గర్వకారణంగా ఉందని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు పునబాక పరిధిలోని హరిజనవాడలో నిర్వహించిన మొబైల్ మెడికల్ క్యాంపుతో ఈ ముఖ్యమైన మైలురాయిని సాధించారు. ఇప్పటివరకు, తొట్టంబేడు, పెల్లకూరు, బి.ఎన్. కండ్రిగ మండలాల పరిధిలో 112 మొబైల్ మెడికల్ క్యాంపులు విజయవంతంగా నిర్వహించారన్నారు. జిల్లా మరియు మండల ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య బృందం, ఫీల్డ్ సిబ్బంది, స్థానిక గ్రామపంచాయతీలు, ఆరోగ్య శాఖ అధికారులు మరియు ప్రజలందరికీ గ్రీన్‌ప్యానెల్ ఫౌండేషన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఆడపిల్లలు ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరగాలి



**శ్రీకాళహస్తి జనవరి 24 ప్రభాతవార్త** ఆడపిల్లలు ఆరోగ్యకరమైన వాతావరణం లో ,మంచి చదువుతో పెరగాలని కోరిన న్యాయవాదులు అన్నారు. జాతీయ ఆడపిల్లల దినోత్సవం సందర్భంగా 12వ అదనపు జిల్లా జడ్జి ఆదేశాల మేరకు శనివారం శ్రీకాళహస్తి పట్టణంలోని ధర్మరాజుల గుడి ఎదురుగా ఉన్న ఎస్సీ మహిళా హాస్టల్ నందు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా సీనియర్ లాయర్ రాజేశ్వరరావు, గరికపాటి రమేష్ , శ్రీరామ్ హాస్టల్ వార్డెన్, విద్యార్థిని పాల్గొన్నారు. న్యాయవాదులు మాట్లాడుతూ ఆడపిల్లలు ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరగాలని, పౌష్టికాహారంతో ఆహారం తీసుకోవాలని, చదివి ఉన్నత స్థాయిలో ఉండాలని కోరారు.

## తిరుపతి జిల్లా మున్సిపల్ వింగ్ ఉపాధ్యక్షుడిగా షేక్ ఫజల్ నియామకం

**తొట్టంబేడు జనవరి 24 ప్రభాతవార్త** వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా అనుబంధ కమిటీల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలో తిరుపతి జిల్లా మున్సిపల్ వింగ్ ఉపాధ్యక్షుడిగా శ్రీకాళహస్తికి చెందిన షేక్ ఫజల్‌ను నియమించినట్లు పార్టీ వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. ఈ సందర్భంగా షేక్ ఫజల్ మాట్లాడుతూ బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆశీస్సులతో జిల్లా క్యాడర్లో నాకు అవకాశం లభించిందని, అదేవిధంగా తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రమాద రహిత జిల్లాగా తిరుపతిని ఉంచాలి



**తిరుపతి రవాణ. జనవరి 24 ప్రభాత వార్త** డ్రైవర్స్ డే సందర్భంగా తిరుపతి బస్టాండ్ నందు సురక్షి తముగా వాహనాలు నడుపుతున్నందుకు ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్లు అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.జగదీష్ రోజా పువ్వులు అందిం చి ప్రమాద రహిత జిల్లాగా తిరుపతిని ఉంచాల ని కోరారు. చెడు అలవాట్లు లేకుండా ఆరోగ్యంగా ఉండాలని మంచి డ్రైవింగ్ అలవాట్లు అలవాటు చేసుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పి.విశ్వనాధ్, తిరుపతి డిపో మేనేజర్ సురేంద్ర కుమార్, సెంట్రల్ బస్టాండ్ ఎటిఎం, బస్టాండ్ అసిస్టెంట్ మేనేజర్, బస్టాండ్ నందులి కంట్రోలర్లు డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాస్ ఆధ్వర్యంలో రహదారి భద్రత అవగాహన సదస్సు

**తిరుపతి రవాణ, జనవరి 24 ప్రభాతవార్త** రహదారి భద్రత అవగాహన సదస్సులో ఆటో మహిళా



డ్రైవర్లు, రాస్ మహిళా సభ్యులకు ప్రత్యేకంగా రహదారి భద్రతా సూత్రాలు, ప్రమాద నివారణ చర్యలు వివరించారు. మోటర్ వాహనాల తనిఖీ అధికారి అతికా నాజ్ పవర్ పాయింట్ ద్వారా రహదారి భద్రతా నియమాలు, ప్రమాద నివారణ టిప్స్‌ను వివరించారు. జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీ మోహన్ మాట్లాడుతూ రాస్ సంస్థ మహిళా ఆటో డ్రైవర్లకు స్త్రీ శక్తి పథకం ద్వారా డ్రైవింగ్ శిక్షణ ఇవ్వడం వల్ల ఉపాధి, భద్రత రెండూ సాధ్యమవుతాయని అన్నారు. ఈ సదస్సులు మహిళా డ్రైవర్లను చైతన్య పరిచే అంశాలని తెలియజేశారు. రహదారి భద్రతా వైద్యురాలు పూజావాణి సీపీఆర్ ప్రొసీజర్‌ను ప్రదర్శించి, ప్రమాదాల సమయంలో ప్రాథమిక చికిత్స గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాస్ డైరెక్టర్ నాగరాజు, ప్రాంతీయ సంయుక్త రవాణా కమిషనర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## లింగ వివక్ష నిర్మూలనే "భేటీ బచావో భేటీ పడావో" లక్ష్యం

### ఆర్‌హెచ్‌టిసి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యు.శ్రీధర్



**చంద్రగిరి, జనవరి 24 ప్రభాతవార్త:** లింగ వివక్ష నిర్మూలనే లక్ష్యంగా భారత ప్రభుత్వం భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి నట్లు రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యు.శ్రీధర్ తెలిపారు. స్థానిక ఆర్‌హెచ్‌టిసిలో శనివారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికంగా అభివృద్ధి, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో సాధికారత సాధించేందుకు లింగ వివక్ష నిర్మూలనపై ప్రజల సహకారంతో ముందుకు సాగాలన్నారు. ప్రతి బాలిక అక్షరాస్యత సాధించడంతో పాటు ఆరోగ్య పరంగా ఎదిగేందుకు పౌష్టికాహాన్ని అందిస్తూ పాఠశాలలో హాజరు శాతాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ ఐ.యుగంధర్, డాక్టర్ రేవతి, డాక్టర్ సౌమ్యప్రియ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎం.టాటాబాయి, పిహెచ్‌ఎన్ ఎస్.శ్యామల, సూపర్‌వైజర్ కె.నారాయణ, ఏఎన్ఎం పద్మావతి, జూనియర్ డాక్టర్స్, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు 600 ప్యాడ్లు పంపిణీ

**సత్యవేడు, జనవరి 24 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలోని పలు హైస్కూళ్ళలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులకు టీడీపీ నాయకులు ప్యాడ్లు పంపిణీ చేశారు. శుక్రవారం వసంత శ్రీపంచమిని పురస్కరించుకుని సత్యవేడు మండలం పాలగుంట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ టీడీపీ నాయకుడు ఈశ్వరయ్య, గజేంద్ర ఈ ప్యాడ్లను వితరణ చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం పాండురంగయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దాత ఈశ్వరయ్య, గజేంద్ర విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పాండురంగయ్య మాట్లాడుతూ వసంత శ్రీ పంచమి రోజున పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేయడం సంతోషాదాయకమన్నారు. అనంతరం పాఠశాల హెచ్ఎం పాండురంగయ్యతో పాటు టీడీపీ నాయకులు కలిసి మండలంలో వివిధ హైస్కూళ్ళలో చదువుతున్న 600 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సురుటుపల్లి ఆలయ ధర్మకర్తల మండల సభ్యులు కృష్ణయ్య యాదవ్, టీడీపీ నాయకులు లోకయ్యరెడ్డి, మురళి(చికెన్ చిన్న), సునీల్‌జైన్, ధనశేఖర్, డేవిడ్, కృష్ణ చైతన్య పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెరకు రైతుల బకాయిలు చెల్లించండి - సీపీఎం

**కేవీబీ పురం, జనవరి 24 ప్రభాతవార్త:**

ఉమ్మడి చిత్తూరుజిల్లాలో నింద్ర వద్ద ఉన్న నేతం షుగర్ ఫ్యాక్టరీ రైతులకు 36 కోట్ల రూపాయలు పైగా చెల్లించాల్సి న బకాయిలను గత ఆరు సంవత్సరాలుగా చెల్లించలేదని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దాసరి జనార్ధన్ తెలిపారు. శనివారం కేవీబీ పురంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ముందు పుత్తూరులో ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రైతులకు బకాయిలు చెల్లిస్తామని హామీలు ఇచ్చారని, నేడు రెండు సంవత్సరాలు అవుతున్నా కూడా రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. పరిశ్రమ యజమానులపై చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. రైతులు బకాయిలు చెల్లించే విధంగా ప్రభుత్వం ఇప్పుడైనా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## రైతు నాయకుడు అప్పలరాజుపై పెట్టిన పీడీ చట్టం ఎత్తివేయాలి : సీపీఎం

**కేవీబీ పురం, జనవరి 24 ప్రభాతవార్త:** రైతుల నుంచి ప్రభుత్వం బలవంతపు భూసేకరణ చేస్తున్న నేపథ్యంలో అనకాపల్లి జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అప్పలరాజుపై ప్రభుత్వం పీడీ యాక్ట్ కింద కేసు నమోదుచేసి అరెస్టు చేశారని సీపీఎం మండల కార్యదర్శి నాగరాజు ఆరోపించారు. శనివారం మండల కేంద్రమైన కేవీబీపురంలో అప్పలరాజుపై పెట్టిన పీడీ చట్టాన్ని ఎత్తి వేయాలని కోరుతూ గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ప్రభుత్వం బలవంతపు భూసేకరణ చేస్తుంటే రైతులకు మద్దతుగా 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని పోరాటం చేసినా రైతు నాయకుడు అప్పలరాజుపై ప్రభుత్వం దుర్మార్గంగా పీడీ చట్టం పెట్టి అరెస్టు చేయడం దారుణమన్నారు. తక్షణమే ప్రభుత్వం అప్పలరాజుపై పెట్టిన పీడీ చట్టాన్ని ఎత్తివేసి బేషరతుగా రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

## ఎస్వీ డబ్ల్యు పాలిటెక్నిక్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 44 ఎంపిక

**తిరుపతి విద్య, జనవరి 24 ప్రభాత వార్త** ఎస్వీ డబ్ల్యు పాలిటెక్నిక్ కళాశాల శనివారం బెంగళూరు లోని



సెంటమ్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంస్థతో కలిసి విజయవంతంగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిం చారు. ఈ డ్రైవ్‌లో డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూని కేషన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన మొత్తం 57 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. వీరిలో 44 మంది విద్యార్థినులు విజయవంతంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. పద్మావతమ్మ ఎంపికైన విద్యార్థినులందరికీ వారి అద్భుతమైన ప్రదర్శనకు , కృషికి అభినందనలు తెలియజేశారు. అలాగే విద్యార్థినులను ఇంటర్వ్యూకు సిద్ధం చేయడంలో నిరంతరం సహకారం, మార్గదర్శకత్వం, కఠినమైన శ్రమ చేసిన ఎలక్ట్రానిక్స్ విభాగ అధ్యాపకులు , ప్లేస్‌మెంట్ టీమ్ ను కూడా ఆమె ప్రశంసించారు. ఎంపికైన విద్యార్థినులందరికీ యాజ మాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు , ప్లేస్‌మెంట్ సెల్ తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, వారి భవిష్యత్ వృత్తి జీవితంలో మంచి విజయాలు సాధించాలని ఆకాంక్షి చారు.

## బోడి సత్రాన్ని తక్షణమే బ్రాహ్మణులకు అప్పచెప్పాలి



**తిరుపతి, జనవరి 24 ప్రభాతవార్త:** విశాఖలో ఉన్న బోడి సత్ర సత్రాన్ని బ్రాహ్మణ అపరకర్మల భవనం స్థానిక కార్పొరేటర్ తాళం వేయడాన్ని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేదం హరిప్రసాద్ పేర్కొన్నారు. తిరుపతిలో శుక్రవారం శనివారం అయిన మాట్లాడుతూ బోడి సత్రాన్ని తక్షణమే బ్రాహ్మణులకు అప్పచెప్పాలని లేనిచో బ్రాహ్మణ మనోభావాలు దెబ్బతింటాయని సీఎం చంద్రబాబు ఈ విషయంలో జోక్యం చేసుకొని సమస్యను తక్షణమే పరిష్కరించుకోవాలన్నారు. ఈ సమస్య విషయంలో విశాఖ జిల్లా బ్రాహ్మణ సోదరులు బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అండగా నిలుస్తుంది రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేగం హరిప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రెడ్డి ప్రకాష్, తిరుపతి జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు నరసింహ చార్య, జిల్లా అధికార ప్రతినిధి బాలాజీ శర్మ, బాలాజీరావు, రాష్ట్ర సంయుక్తకార్యదర్శి ముకుందాపురం మహేష్, మురళీధర్ శర్మ, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో మాస్టర్ హెల్త్ చెక్ అప్ ప్యాకేజీలు



**తిరుపతి హెల్త్, జనవరి 24, ప్రభాతవార్త** శ్రీ వేంకటే శ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) నందు కమ్యూనిటి మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో పేషంట్ల సౌకర్యార్థం వివిధ రకములైన మరిన్ని మాస్టర్ హెల్త్ చెకప్ ప్యాకేజ్లను అందుబాటులోకి తెచ్చినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేశారు. ఈ స్పెషల్ క్లినిక్‌కు నేరుగా నమోదు చేసుకొనుటకు పేషంట్లు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు స్విమ్స్ క్లినిక్ నందు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కొరకు కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డా. నాగరాజు ఫోన్ నెంబర్ : 8333997968 సంప్రదించాలన్నారు.

## బాలికల ఆత్మరక్షణ హక్కులపై అవగాహన పెంచాలి



**కార్వేటినగరం, జనవరి 24 ప్రభాతవార్త:** పాఠశాలలు, మీడియా, ప్రజాసంఘాలు, బాలికల హక్కులు, సంరక్షణ వంటి విషయాలపై అవగాహన పెంచాలని కార్వేటినగరం మండలం డి.యం.పురం ఉన్నతపాఠశాల హెచ్‌యం నాధమునిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో జాతీయ బాలికలదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రార్థనాసమావేశం సమయంలో జాతీయ బాలికల దినోత్సవం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్య, విద్య, సామాజిక ఎదుగుదల వంటి అంశాలపై పాఠశాలలు, మీడియా, బాలలసంఘాలు విస్తృతంగా చర్యలు, సమావేశాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పి,సి, చైర్మన్, త్యాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలికల ఉన్నత పాఠశాలలో సిసి రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే



**నారాయణవనం, జనవరి 24 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని బాలికల ఉన్నత, ప్లస్ పాఠశాలలోని మినీ ఆడిటోరియం చుట్టు జడ్పీ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డును శనివారం ఉదయం 9గంటలకు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి నాయకులు, అధికారులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు మౌళిక సదుపాయాలు కల్పిస్తే మంచి వాతావరణంలో పిల్లలు చదువుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థులు కూడా బాగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం జడ్పీటీసీ కోనేటి సుమన్‌కుమార్ మాట్లాడుతూ త్వరలో జరిగే పది, ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులను తీసుకోస్తే నగదు బహుమతి అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ అరుణ, ఎంఇఓలు కోదండనాయుడు, జనార్ధన్‌రాజు, కస్తూరయ్య, మాజీ ఎంఇఓ ప్రభాకర్‌రాజు, ఎఓ శోభారాణి, డిప్యూటీ ఎంపిడిఓ డాక్టర్ వేణయ్య, ఎంపిఓ సుఖన్య, ఎంపిఎం ధనంజయనాయుడు, సర్పంచులు ఆరుముగం, రమేష్‌బాబు, కెజి శారదమ్మగణేషన్ కుమారుడు లక్ష్మణన్, ధర్మలింగం, నాయకులు టి సుబ్రమణ్యం, సుధాబాబు, అచ్చుకట్ల హరి, మాణిక్యంరెడ్డి, బాలమురుగన్, బిఎం నరేష్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కమనీయం కళ్యాణ వేంకటేశ్వరుని ఊంజల్‌సేవ



**నారాయణవనం, జనవరి 24 ప్రభాతవార్త :** నారాయణవనంలోని కళ్యాణవెంకటేశ్వరుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

## ఈ నారీలు, సిఆర్పిలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం

**వరదయ్యపాలెం, జనవరి 24, ప్రభాతవార్త** వరదయ్యపాలెం మండల మహిళా సమైక్య కార్యాలయం నందు 35 వెలుగు గ్రామ సమాఖ్యలకు చందిన ఈ నారీలు, సిఆర్పిలకు శనివారం రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలని, ఉన్న జీవనోపాధులు బలోపేతం చేసుకొనుటకు, కొత్త జోనోపాదులకు అవకాశం కల్పించుకొనుటకు, ప్రతి స్వయం సహాయ సంఘం ఒక స్వతంత్ర ఆర్థిక సంస్థగా ఎదుగుటకు ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్ ) ద్వారా ఈనారి, సి ఆర్ పి వ్యవస్థను తీసుకుని వచ్చిందని, మన డబ్బులు మన లెక్కల ద్వారా సంఘం లెక్కలు పారిదర్శకంగా ఉంటాయని ఎటువంటి అవక తవకలకి అవకాశాలు ఉండవని ఏపీఎం సీతారామయ్య తెలియపరిచారు. ప్రతి పది సంఘాలకు ఒక ఈనారి ఉంటారని, 25 సంఘాలు పైబడిన గ్రామ సంఘాలలో వ్యవసాయ అనుబంధ రంగాలు మెరుగుపరచడానికి ఒక సిఆర్పి, వ్యవసాయేతర జీవనోపాదులు మెరుగుపడేలా అవగాహన కల్పించడానికి ఇంకొక సీఆర్పీ ఉంటారని తెలియపరిచారు. ఈ రెండు రోజుల్లో 111 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సీసీలు యశోద, సుబ్రహ్మణ్యం, మహలక్ష్మి, రమేష్, హనుమంతు, అకౌంటెంట్లు మాధవి, మమత మండల మహిళా సమైక్య అధ్యక్షులు భూలక్ష్మి పాల్గొన్నారు.

## లిటిల్ ఇన్సెక్ట్స్ బిగ్ స్మైల్ టు హెల్పస్ అనే అవగాహనా సదస్సు



**తిరుపతి విద్య, జనవరి 24 ప్రభాత వార్త** గీతం స్కూల్ పర్యావరణ వ్యవస్థ యొక్క ప్రాముఖ్యత ను హైలైట్ చేయడానికి లిటిల్ ఇన్స్ బిగ్ స్మైల్ హెల్ప్అస్ " అనే అవగాహన కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించింది. పాఠశాల లిటిల్ వార్స్మ్, పరేడ్ ను నిర్వహించింది. ప్రై ప్రైమరీ విద్యార్థులు సృజనాత్మకతో కీటకాల వేష ధారణలను ధరించి ఉత్సాహంగా కవాతులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం యువ మనస్సులలో పర్యావరణ బాధ్యతను పెంపొందించడం. మానవాళి సంక్షేమం కోసం ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థను నిర్వహించడంలో సహాయపడటం లక్ష్యంగా పెట్టుకున్నాం అని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కిన్నెర శ్రీదేవి మాట్లాడుతూ పాఠశాల విద్య పుస్తకాలు, అధ్యయన సామాగ్రికే పరిమితం కాదని, రేపటి బాధ్యతాయుతమైన యువ పౌరులుగా పిల్లలను పెంపొందించడంపై కూడా దృష్టి పెట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డా. తమ్మినేని వెంకటేశ్వర్లు,గేట్ కళాశాల ప్రిన్సిపాల్ డా రాజశేఖర్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీ డబ్ల్యు డిగ్రీ,పీజీ కళాశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం



**తిరుపతి విద్య, జనవరి 24 ప్రభాత వార్త** ఎస్వీ డబ్ల్యు డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. తిరుమల నారాయణమ్మ విచ్చేసి మాట్లాడుతూ మురికి, చెత్త పదార్థాలు కళాశాల ప్రాంగణంలో లేకుండా కళాశాలను సంరక్షి ంచుకోవాలని అన్నారు. వ్యర్థ పదార్థాల చేరిక వలన క్రిమి కీటకాలు వృద్ధి అవుతాయి అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంతో వాటిస్థానాలను ధ్వంసం చేయాలన్నారు. అప్పుడే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినవారం అవుతామన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సాధిస్తామని విద్యార్థినిలు, అధ్యాపక బృందం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్.1 అధికారిణి డాక్టర్. కృష్ణవేణి, ఎన్.ఎస్.ఎస్ 2 అధికారిణి డాక్టర్. దివ్యవాణ, సాయి కుమారి, డాక్టర్. వసుధ, డాక్టర్ .శిరీష డాక్టర్. భారతి, విజయ, జ్ఞాన ప్రసూన, డా.సుహా సిని, డా.పద్మజ, డా.శ్రీలత, డా.యామిని, డా.వర ప్రసూన, డా.కస్తూరి, డా.శ్రీవాణి, డా.నాగమణి, డా.పుష్పలత, డా.చెంచులక్ష్మి ṁ, డా.మాధవి, డా.పద్మావతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సంస్కృతంలో నూతన శబ్ద నిర్మాణం కార్యశాల సమాపనోత్సవం



**తిరుపతి విద్య, జనవరి 24 ప్రభాత వార్త** భారతీయ భాషా సమితి, జాతీయ సంస్కృత వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రెండు రోజుల సంస్కృతంలో నూతన శబ్దనిర్మాణం అనే అంశంపైన కార్యశాల ముగింపోత్సవం జరిగింది. అనంతరం విశిష్టాతిథి స్టెల్లా కళాశాల ఆచార్యులు ప్రొ.ధూళిపాల రామకృష్ణ మాట్లాడుతూ సంస్కృత భాషను జనభాషగా చెయడం అత్యంత అవసరమని, ఈ కార్యశాల ద్వారా రెండురోజుల పాటు కౌటిల్య అర్థశాస్త్రంలో ఉన్న శబ్దజాలాన్ని వెలికితీయడం అత్యంత సంతోషదాయ కమని తెలియజేశారు. ఎన్.సి.ఇ.ఆర్.టి ఆచార్యులు ప్రొ.జతింద్ర మోహన్ మిశ్రచే ఆధునిక సంస్కత శబ్దనిర్మాణం భావిభారత పౌరులకు ఎంతో అవసరమని అటువంటి శబ్దనిర్మాణం ఈ కార్యశాల ద్వారా అత్యంత చక్కగా నిర్వహించడం జరిగింది. ప్రొ.సీమాచల పండా విచ్చేసి సంస్కృతంలో నూతనంగా నిర్మాణం చేయవలసిన ఆధునిక శబ్దాల ఆవశ్యకత , కార్యశాల ద్వారా నిర్మాణం చేసినటువంటి శబ్దసంగ్రహాన్ని సుస్పష్టంగా ఒకేచోట తీసుకువస్తున్న విధానాన్ని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సంయోజకులుగా రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ విభాగం అధ్యక్షులు ప్రొ.శివరామకృష్ణ భట్ వ్యవహరించి కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల అధ్యాపకులు, దేశంలోని వివిధ వర్సిటీ నుండి విచ్చేసినటువంటి విద్వాంసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేణిగుంట మండలంలో బాలికల దినోత్సవం

**రేణిగుంట జనవరి 24 ప్రభాతవార్త**



రేణిగుంట మండలంలో పలు గ్రామాల్లో జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గుత్తి వారి పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మల్లెమడుగు ఎస్టీ కాలనీలలో ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ కోఆర్డినేటర్ జయలక్ష్మి ṁ లింగ వివక్షతను రూపుమాపాలని పిలుపునిచ్చారు. రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ప్లస్ టు ఉన్నత పాఠశాలలో జరిగిన జాతీయ బాలిక దినోత్సవం లో బి బి సి ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్ రెడ్డి బాలికల హక్కుల గురించి వివరించారు. రేణిగుంట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర అధికారి డాక్టర్ చక్రపాణి ఆదేశాల మేరకు హెల్త్ సూపర్వైజర్ కామరాజు బాలికలకు బాలికల చట్టాలపై అవగాహన

# అరాచకాల మయంగా... కూటమి ప్రభుత్వం

### - వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి



వెంకటగిరి, జనవరి 24 ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అరాచకపాలన సాగుతున్నట్లు వైసిపి ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవనంలో వైసిపి సంస్థగత నిర్మాణంపై నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తలు నాయకులు సమావేశం నిర్వహించారు. రెడ్ బుక్కు రాజ్యాంగం పేరుతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వారిని ఇబ్బంది పాలు చేస్తున్నట్లు విమర్శించారు. 2024వ సంవత్సరంలో గాని హామీలను ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. కండలేరు డాం నీళ్లను పరిశీలించేందుకు వెళితే పోలీసులు అడ్డగించుకొని వైసీపీ వారిని పోలీస్ స్టేషన్ తరలించారని చెప్పారు. తెలుగుదేశం పార్టీ వారు వెళితే వారికి పోలీసులు రాజ మర్యాదలు చేసి డ్యాం చూపించారని తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకాలను అమలులోకి తీసుకొచ్చిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి జనార్దనరెడ్డి అని చెప్పారు. హైదరాబాదులో హైటెక్ సిటీ కిషన్కు స్థాపన చేసింది కూడా జనార్దన్ రెడ్డి అనే గుర్తు చేశారు. అప్పట్లో అనేక పథకాలు జనార్దన్ రెడ్డి అమలు చేశారని తెలిపారు.

అందరూ ప్రచారం తక్కువ చేసుకునేదని తెలిపారు. అయితే సీఎం నారా చంద్రబాబు నాయుడు కొద్దిగా ప్రచారం చేసి విపరీతంగా పబ్లిసిటీ ఇచ్చుకుంటున్నట్లు విమర్శించారు. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2027లో జమిలి ఎన్నికలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలత, ఎస్‌సిసి సభ్యులు మస్తాన్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, ఉమామహేశ్వరి, జిల్లా టెలికాం సలహాలు సభ్యులు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సేవే లక్ష్యంగా రక్తదాన శిబిరం నిర్వహణ




నాయుడుపేట, జనవరి 24 ప్రభాతవార్త: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలన్న సంకల్పంతో గత 20 ఏళ్లగా టిఎంఆర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం నాయుడుపేట పట్టణంలోని శ్రీ వేమ డిగ్రీ కళాశాలలో ఇండియన్‌రెడ్ క్రాస్ సొసైటీ (నెల్లూరు) సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా టిఎంఆర్ విద్యాసంస్థల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. తొలుత రక్తదాన శిబిరం ప్రారంభోత్సవం సందర్భంగా జాతీయ రక్తదాన దినోత్సవాల్లో భాగంగా నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అందజేసిన ఉత్తమ సేవా ప్రశంసా పత్రం, మెమెంటోలను రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి ఎం.మధుసూదన్ రావు టిఎంఆర్ విద్యాసంస్థల అధినేత తంబిరెడ్డి మనోహర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డికి మధుసూదన్ రావు శాలువా కప్పి, సన్మానించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం కోసం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలు విజయవంతం అయ్యేందుకు సహకరిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులకు, కళాశాల అధ్యాపక సిబ్బందికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు ఎ.కృష్ణవేణి,కె.శ్రీలక్ష్మి,శ్రీ వేమ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రంజిత్ రెడ్డి, మేనేజర్ జితేంద్ర రెడ్డి, ఎన్ఎస్ఎస్‌పిఓలు నరేంద్ర, సురేంద్ర, సన్నీలు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎంపీడీవో



వాకాడు, జనవరి 24 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శనివారంలో జరగాల్సిన కార్యక్రమంను నాలుగో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంను ఎంపీడీవో సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఎంపీడీవో సాయి ప్రసాద్, తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్‌లు మండల స్థాయి అధికారులు, మండల పరిషత్, తహసిల్దార్ సిబ్బంది కలిసి ప్రతిజ్ఞ చేసిన అనంతరం మండల కేంద్రమైన వాకాడు బజారు వీధిలో రోడ్‌కి ఇరువైపులా ఆ ప్రాంతంలో పడి ఉన్న వ్యర్థపదార్థలను తొలగించి శుభ్రపరిచారు. ఎంపీడీవో సాయిప్రసాద్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మన ఇంటి ఆవరణంతో పాటు, గ్రామం సమీపంలో ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్‌కి ఇరువైపులా మలవిసర్జన చేయకుండా చూడాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో దేవానందం, మండల పరిషత్ ఏవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి ప్రవళిక, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్ఓలకు అవగాహన



వాకాడు, జనవరి 24 ప్రభాతవార్త: మండల తహసిల్దార్ కార్యాలయం ఆవరణంలో తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయి ప్రసాద్‌లు ఓటర్ల దినోత్సవం సందర్భంగా ముందస్తుగా బిఎల్వోలకు అవగాహన కల్పించారు. శనివారం ముందస్తుగా ఓటర్లకు తహసిల్దార్ పలు సూచనలు సలహాలు బి ఎల్‌వోలకు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సయూద్ ఇక్బాల్ మాట్లాడుతూ జనవరి 25 తేదీన ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఆయా పంచాయతీ గ్రామాలలో ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పిస్తూ, అదే విధంగా కొత్తగా ఓటును ఓటర్లుగా నమోదు చేసే కార్యక్రమాలను చేపట్టాలని బిఎల్ఓలకు తహసిల్దార్ సయ్యుద్ ఇక్బాల్ తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, బిఎల్ఓలు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వంలో రిలీఫ్ ఫండ్ ఇవ్వలేదు : ఎమ్మెల్యే



వెంకటగిరి, జనవరి 24 ప్రభాతవార్త: గత వైసిపి ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎవరికి పంపిణీ చేసిన పాపాన పోలేదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఎమ్మెల్యే స్వయంగా వారిని పరామర్శించి సీఎం రిలీఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సీఎం సహాయనిధి చెక్కులను నిత్యం పంపిణీ చేస్తూ ఉంటామని తెలిపారు. గత ప్రభుత్వంలో వైద్య రంగాన్ని విస్మరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, మాజీ పట్టణ పార్టీ అధ్యక్షులు ఆనందు తదితరులు పాల్గొన్నారు.

## రాస్‌లో రహదారి భద్రత అవగాహన సదస్సు



తిరుపతి కలెక్టరేట్, జనవరి 24 ప్రభాతవార్త : రహదారి భద్రత అవగాహన సదస్సులో ఆటో మహిళా డ్రైవర్లు, రాస్ మహిళా సభ్యులకు ప్రత్యేకంగా రహదారి భద్రతా సూత్రాలు, ప్రమాద నివారణ చర్యలు వివరించారు. మోటర్ వాహనాల తనిఖీ అధికారి అతికా నాజ్ పవర్ పాయింట్ ద్వారా రహదారి భద్రతా నియమాలు, ప్రమాద నివారణ టిప్స్‌ను వివరించారు. జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీ మోహన్ మాట్లాడుతూ రాస్ సంస్థ మహిళా ఆటో డ్రైవర్లకు స్త్రీ శక్తి పథకం ద్వారా డ్రైవింగ్ శిక్షణ ఇవ్వడం వల్ల ఉపాధి, భద్రత రెండూ సాధ్యమవుతాయని అన్నారు. ఈ సదస్సులు మహిళా డ్రైవర్లను చైతన్య పరిచే అంశాలని తెలియజేశారు. ప్రాంతీయ సంయుక్త రవాణా కమిషనర్ కృష్ణవేణి తెలిపినట్లు, "తిరుపతిలో మహిళా డ్రైవర్ల సంఖ్య పెరగడం మహిళా ప్రయాణికుల భద్రతకు ప్రధానమైన అంశమని సురక్షి త డ్రైవింగ్ చేయటానికి మహిళా డ్రైవర్లు బాధ్యతాయుతంగా ఉంటారని తెలియజేశారు. రహదారి భద్రతా వైద్యురాలు పూజవాణి దిశిళి ప్రొసీజర్‌ను ప్రదర్శించి, ప్రమాదాల సమయంలో ప్రాథమిక చికిత్స గురించి వివరించారు. ప్రమాదాల్లో మొదటి నాలుగు నిమిషాల్లోదిశిళి చేస్తే హృదయ స్పందన తక్షణమే మెరుగైవుతుందని తెలియజేశారు. ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రున్ని తక్షణమే ఆసుపత్రికి తరలించే విషయంలో రహవీర్ చట్టం అన్ని విధాలుగా సహాయం చేసే వ్యక్తికి తోడ్పాటు గా ఉంటుందని తెలియజేశారు రాస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూఈ సదస్సు రహదారి భద్రత భద్రతను పెంచడానికి మరియు మహిళా డ్రైవర్లకు మరిన్ని శిక్షణ కార్యక్రమాలు భవిష్యత్తులో నాంది పలికాయని, అందరూ రహదారి భద్రతా నియమాలు పాటిస్తే ప్ర మాదాల సంఖ్య గణనీయంగా తగ్గుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ మోటర్ వాహనాల తనిఖీ అధికారి స్వర్ణలత, ప్రముఖ యోగ మాస్టర్ రాంజీ పాల్గొన్నారు.

## చంద్రబాబుకు వీరాభిమానిని : భానుప్రకాశ్




పుత్తూరు (నగరి), జనవరి 24 ప్రభాతవార్త : తాను చంద్రబాబునాయుడుకు వీరాభిమానినని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. శనివారం నగరి పట్టణంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. తాను అమెరికాలో చదువుకునే రోజుల్లో అక్కడ చంద్రబాబు విధానాలు, పరిపాలనను ప్రశంసించేవారని తెలిపారు. న్యూయార్క్ టైమ్స్ వంటి అంతర్జాతీయ పత్రికల్లో చంద్రబాబు గురించి రాసేవారన్నారు. ఆయనను విజనరీ లీడర్‌గా పేర్కొనేవారని, ఇవన్నీ చూసి తాను ఆయనకు వీరాభిమానిగా మారిపోయాయని తెలిపారు. తన తండ్రి దివంగత ముద్దుకృష్ణమనాయుడు అడుగు జాడల్లో రాజకీయాల్లో కొనసాగుతున్నానని, లోకేష్‌బాబుకు విధేయుడనని తెలిపారు. చిత్తూరు జిల్లాకు కృష్ణా నది నీళ్లను చంద్రబాబు తీసుకువచ్చారని, అలాగే నగరికి తీసుకువస్తారని ఆశిస్తున్నానని, అది ఆయన వల్లే సాధ్యమవుతుందని అన్నారు. విజయపురం మండలంలోని కోసలనగరంలో పరిశ్రమల ఏర్పాటుకు 2500 ఎకరాలు సిద్ధంగా వుందని, మరో 2500 ఎకరాల స్థలాన్ని సేకరించవచ్చని తెలిపారు. రెండు హార్బర్‌లు, రెండు ఎయిర్ పోర్ట్‌లు, రెండు జాతీయ రహదారులు అందుబాటులో వున్న ఈ ప్రాంతం పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనుకూలమని తెలిపారు.

## గోపురాలకు విద్యుత్ ఆలంకరణలు




శ్రీకాళహస్తి,జనవరి 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వచ్చేనెల 10నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబులు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని పలు కూడలి ప్రాంతాల్లో విద్యుత్ దేవతల ను ప్రతిష్టించుటకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. అలాగే ఆలయానికి ప్రధాన గోపురం బిచ్చల గాలిగోపురంపై విద్యుత్ దీపాల ముస్తాబులకు శ్రీకారం చుట్టారు. శనివారం ట్రయల్ రన్ వేసారు. శివరాత్రికి ప్రత్యేకాకర్షణ లైటింగ్. ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

## నేడు రథసప్తమి వేడుకలకు అంతా సిద్ధం

నారాయణవనం, జనవరి 24 ప్రభాతవార్త : నారాయణవనంలో ప్రసిద్ది చెందిన పద్మావతీదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని ఆలయంలో రథసప్తమి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం ఏడు వాహనాల్లో స్వామి,అమ్మవార్లు ఊరేగడం జరగనుంది. ఇందులో భాగంగా ఉదయం సూర్యప్రభవాహనంపై స్వామి, అమ్మవార్లు ఊరేగించడం జరుగుతుందని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై ఊరేగించడం జరుగుతుందన్నారు. అనంతరం ఉదయం 9గంటల నుంచి చిన్నశేష, హంసం, కల్పవృక్ష, పెద్దశేష, తిరుచ్చివాహనంపై ఊరేగతారన్నారు. రాత్రి 8గంటలకు చంద్రప్రభ వాహనంతో ఉత్సవాలు ముగుస్తుందన్నారు. స్వామి,అమ్మవార్లు గ్రామ వీధుల్లో ఊరేగకుండా ఆలయంలోనే ఏకాంతంగానే ఈ ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు.

## శివయ్యసేవలో సుప్రీం జడ్జి



శ్రీకాళహస్తి,జనవరి 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో శనివారం సుప్రీం కోర్టు జడ్జి కుటుంబసభ్యులతో కలసి పూజలు జరిపించుకున్నారు. సుప్రీంకోర్టు జడ్జి ఎస్‌విఎన్ భట్ కుటుంబ సభ్యులతో రాగా వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఎఇఒ మోహన్, విద్యాసాగర్‌రెడ్డి, ఏపి ఆర్‌ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. వారికి ఆలయ ఇఒ బాపిరెడ్డి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఏర్పాట్లును నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు వెంకటస్వామి పర్యవేక్షించగా స్వాగతం పలికిన వారిలో ప్రోటోకాల్ జడ్జి శ్రీనివాస్ నాయక్, జడ్జిలు బేబీరాణి, కృష్ణప్రియ,కోర్టు పర్యవేక్షకులు రవి కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## సువర్ణముఖి తీరాన్ని పరిశుభ్రం చేసిన మున్సిపాలిటి



శ్రీకాళహస్తి,జనవరి 24 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛంద్ర: స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా శనివారం మున్సిపల్ సిబ్బంది,అధికారులు,మెప్మాసిబ్బంది తెలుగుదేశం నాయకులు కలసి సువర్ణముఖి తీరాన్ని పరిశుభ్రం చేసే కార్యక్రమాలను చేపట్టారు. శనివారం వేకువ జాము నుంచి ఈ కార్యక్రమాలను చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడుల పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల మల మూత్రాలనుబహిరంగ ప్రదేశాల్లో వెళ్ళరాదనే మహోన్నత లక్ష్యంతో ప్రభుత్వం వ్యక్తిగత టాయిలెట్లును నిర్మించుకొనుకు రూ.15వేలు మంజూరు చేస్తుందని ఈ మేరకు అవసరమైన వారు మున్సిపల్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో విజయకుమార్, కమిషనర్ భవాని ప్రసాద్, తెలుగుదేశం పార్టీకి చెందిన గోపినాథ్, మధు,పోలూరు శ్రీనివాసులు, ఆర్ముగం, శివారెడ్డి, యశ్వంత్‌బాబు, దొరబాబు, షాకీర్ అలి, అద్దంకి హేమంత్‌కుమార్, భరత్,చంద్రమ్మ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణ ఆంధ్ర .. స్వచ్ఛ ఆంధ్ర మనందరి బాధ్యత

### మిట్టపాళ్యం పంచాయతీలో స్వచ్ఛరథం ప్రారంభం



చంద్రగిరి, జనవరి 24 ప్రభాతవార్త: స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడం మనందరి బాధ్యత అని ఎంఎల్‌ఏ పులివర్తి నాని అన్నారు. మిట్టపాళ్యం పంచాయతీ, శ్రీనివాస మంగాపురంలో శనివారం ఆయన స్వచ్ఛ రథంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నిషేధించి, స్వర్ణ చంద్రగిరి, స్వర్ణ ఆంధ్రను కాపాడుకుందామని అన్నారు. ప్రతి ఇంటి నుండి సేకరించే తడి చెత్త, పొడి చెత్త విలువకు సరిపోయే నిత్యవసర వస్తువులను అందించి ప్రోత్సహించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. తద్వారా నివాసాలతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా వుంటాయని అన్నారు. ఇందు కోసం ప్రతి నెల 3వ శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, అన్ని విభాగాలలో ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఆ మేరకు ఎంఎల్‌ఏ ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులతో మానవ హారం నిర్మించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ డి.సుశీలాదేవి, తహశీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపిడిఓ అమర్‌నాథ్ రెడ్డి, టిడిపి నాయకుడు, క్లాస్1 కాంట్రాక్టర్ ఏ.వి.రమణమూర్తి, టిడిపి మండల అధ్యక్షుడు ఏజి పల్లి బాల, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ గౌస్‌భాషా, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొందూరు ప్రవీణ్ రాయల్, పనపాకం క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మేడసాని కుమార్, టిడిపి చంద్రగిరి అధ్యక్షుడు సక్కూరు ధనంజయ రెడ్డి, మిట్టపాళ్యం గ్రామకమిటీ అధ్యక్షుడు రాజా రాయల్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పోతల ప్రవీణ్‌కుమార్, చంద్రగిరి ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు, గాలి సతీష్, మంగాపురం భాస్కర్, సునీల్, రాధ, సునీత, మంగాపురం లోకేశ్వరీ, నాయుడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం దేవస్థానంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ



కాణిపాకం, జనవరి 24 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ, దర్మధాయశాఖ ఆదేశాల మేరకు ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ఆలయ చైర్మన్ వి.మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్‌ల ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స ్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మొదటగా దేవస్థానం అతిథి గృహం వద్ద ఆలయ సిబ్బంది, పాలకమండలి సభ్యులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆలయ ఆలయ అధికారులు, బోర్డు సభ్యులు, సిబ్బందితో కలసి ఆలయ మాఢా వీధులు,బస్టాండు మీదుగా ర్యాలీ నిర్వహించారు. అలాగే పారిశుద్య కార్మికులతో పారిశుద ్య పనులు నిర్వహించారు. ఈ కార్యాక్రమంలో ఈఈ వెంకటనారాయణ,సీఎఫ్ఓ నాగేశ్వరరావు, ఏఈఓలు ధనంజయ, ప్రసాద్, హరి మాధవరెడ్డిలతో పాటు బోర్డు సభ్యులు నాగరాజులు నాయుడు, నరేష్, శివప్రసాద్, కత్తి సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, సతీష్, చంద్రకళ, టివి.రాజ్యలక్ష్మీ, వసంతమ్మ, శ్రీవాణి, పద్మలత, కృష్ణవేణి, కెఎస్.అనుసూయమ్మ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## ఎమ్మెల్యేపై ఆరోపణలను ఖండించిన తెదేపా నాయకులు




పెళ్లకూరు, జనవరి 24 ప్రభాతవార్త: సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పై కొన్ని మీడియా ఛానల్లో వచ్చిన వార్తలను పెళ్లకూరు మండలం తెదేపా నాయకులు ఖండిస్తూ మండిపడ్డారు. శనివారం నాడు కొత్తూరు తెదేపా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో తెదేపా మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య మాట్లాడుతూ గత వైసిపి అరాచక పాలనలో ఏ తెలుగుదేశం నాయకుడు బయటికి వచ్చి మాట్లాడలేని సమయంలో నేనున్నా నంటూ మాలో మనోస్థైర్యం నింపి వైసీపీ పార్టీని ఎదిరించేలా నిలిపిన నాయకుడు నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ పై తండ్రి నెలవల సుబ్రహ్మణ్యం పెత్తనం ఎక్కువైందని అలాగే భర్త ఆమె సహోదరులు రాజకీయ పెత్తనం చేస్తున్నారని అసత్య ఆరోపణలు చేస్తూ పార్టీను ఎమ్మెల్యేను అప్రతిష్ట పాలు చేస్తున్నారని మండిపడ్డారు. పునబాక పోలయ్య మాట్లాడుతూ రాబోయే సంస్థ గతి ఎన్నికల్లో మా పనితీరుతోనే సమాధానం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో దామర్ల ప్రసాద్ నాయుడు, కిలారి గోపి యాదవ్, పునబాక పోలయ్య, రాజారెడ్డి, మల్లు ప్రసాద్, తాళ్ల యుగంధర్, హరి నాయుడు, రాపూరు పరశురాం, కోట రమేష్ యాదవ్, డి.సుబ్రహ్మణ్యం, మేకపిల్ల రవి, మెరుమ్ చంద్ర, గుంటపూడి రమణయ్య, వేణురెడ్డి పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలి : కమిషనర్




వెంకటగిరి, జనవరి 24 ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలని ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు తెలిపారు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వీధుల్లో చెత్తాచెదారం వేయరాదని సూచించారు. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఒంటరి మహిళ హత్య కేసును ఛేధించిన పోలీసులు

### నిందితుడు అరెస్ట్ .. రిమాండ్‌కు తరలింపు



రామచంద్రాపురం, జనవరి 24 ప్రభాతవార్త: బలిజ పల్లి గ్రామంలో ఒంటరి మహిళ మునీశ్వరి హత్య కేసును పోలీసులు ఛేధించారు. నిందితుడు విశ్వనాథ్ అలియాస్ ప్రశాంత్‌ను అరెస్ట్ చేసినట్లు చంద్రగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ శనివారం ఆర్‌సి పురం పోలీస్ స్టేషన్ మీడియాకు వెల్లడించారు. బలిజపల్లికి చెందిన మునీశ్వరి తన నివాసంలో ఒంటరిగా నివశిస్తున్నది. ఈ నెల 11వ తేదీన ఆమె తన ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెంది వుండటాన్ని స్థానికులు గమనించి మృతురాలి కుమారుడు కుప్పయ్యకు సమాచారం అందించారు. దీంతో తన తల్లి అనుమానాస్పద మృతిపై కుప్పయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రాథమిక విచారణలో ఆమె హత్యకు గురైనట్లు నిర్ధారించుకున్న పోలీసులు ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఎస్ఐ భక్తవత్సలం సాంకేతికతను ఉపయోగించి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో రాయలచెరువు సమీపంలోని చిట్టత్తూరు కాలేపల్లి కూడలి వద్ద శుక్రవారం సాయంత్రం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో ఈ నెల 8న మునీశ్వరిని హత్య చేసి మృతురాలి తాళిబొట్టును తీసుకెళ్ళినట్లు నిందితుడు అంగీకరించాడు. దీంతో నిందితుడి వద్ద నుండి 27 గ్రాముల బంగారు తాళిబొట్టును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా గత ఏడాది వెంకట్రామాపురం సమీపంలో ఒంటరి మహిళ మెడలో చైన్ లాక్కుని వెళ్ళినట్లు అంగీకరించాడు. 24 గ్రాముల బంగారు చైన్‌ను సైతం స్వాధీనం చేసుకున్నారు. చిన్న చిన్న చోరీలకు పాల్పడుతూ పోలీసుల కళ్ళుగప్పి తిరుగుతున్న నిందితుడిపై తిరుపతిలో 4 కేసులు నమోదైనట్లు తెలిపారు. అత్యంత చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ భక్తవత్సలం, ఏఎస్ఐ ఈశ్వరయ్య, హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్, సిబ్బందిని సిఐ అభినందించారు.

## గడప లోపల కులం... గడప దాటితే హిందువులం



రేణిగుంట జనవరి 24 ప్రభాతవార్త: గడప లోపలే కులాలని గడప దాటితే మనమంతా హిందువులమని శ్రీశ్రీశ్రీ జగన్మాత అచల పీఠాది. పతి చిలుకూరు కృష్ణ స్వామి ఉద్ఘటించారు. రేణిగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో శనివారం హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం జరిగింది. ముందుగా శ్రీశ్రీశ్రీ జగన్మాత అచల పీఠాధిపతి చిలుకూరి కృష్ణస్వామి విశిష్ట అతిథి గా ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ గోష్ ప్రముఖ చేజర్ల గంగాధరం ప్రముఖ వక్తగా నాగార్జున పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి, శ్రీ వెంకటేశ్వర హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ జనార్ధన్ ముఖ్య అతిథులుగా జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మేళనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హిందూ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. భారతదేశము వేద భూమి,కర్మభూమి, పుణ్యభూమి ,పవిత్ర భూమి, అని వ్యాఖ్యానించారు. సృష్టిలోని అన్ని జీవాలు సుఖంగా ఉండాలని ప్రార్థన చేసేది హిందుత్వమే అన్నారు. అందుకే సర్వే భవంతు సుఖినా అంటున్నామని నొక్కి వక్కాణించారు. కార్యక్రమంలో బి ఎం ఎస్ జిల్లా కార్యదర్శి వెంకటాద్రి యాదవ్, ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమశేఖర్, రాష్ట్రీయ బిఎంఎస్ రేణిగుంట కార్యనిర్వహణ కార్యదర్శి కేశవప్ప, రాష్ట్ర బిజెపి కిసాన్ మోర్చా నాయకులు చంద్రారెడ్డి, శ్రీ గంగమ్మ దేవస్థానం శాశ్వత ధర్మకర్త సోలా మల్లికార్జున్ రెడ్డి, బిజెపి మండల కార్యదర్శి రాజా రాయల్, రేణిగుంట పట్టణ బిజెపి అధ్యక్షుడు నరేష్ రాయల్, తెలుగుదేశం పార్టీ యువనేత ఎంజిరెడ్డి, ఇస్కాన్ ప్రతినిధులు,పెద్ద సంఖ్యలో బిజెపి నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శిగా బుసెపల్లి



కల్లూరు, జనవరి 24 ప్రభాతవార్త: రాష్ట్ర వైఎస్ఆర్‌సిపి కార్యదర్శిగా బుసెపల్లి ఆనంద్ కుమార్ ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వీరవిధేయుడిగా వైఎస్ఆర్ వ్యగిత రాజకీయ సలహాదారుగా గత కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండు పర్యాయాలు ముఖ్యమంత్రి పదవి రావడం కోసం విలువైన రాజకీయ సలహాలు అందించానన్నారు. వైఎస్ఆర్ మరణానంతరం పెద్దిరెడ్డి, మిధున్ రెడ్డి ఆశీసులతో వైఎస్ జగన్‌ని ముఖ్యమంత్రి చేయడంలో విశేష కృషి చేసి పులిచర్ల మండలం వైఎస్ఆర్‌సిపి ఉపాధ్యక్షులుగా పని చేసిన సీనియర్ నాయకులు బుసెపల్లి ఆనంద్ కుమార్, ఉమ్మడి చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం పులిచర్ల మండలం ఎల్లంకివారిపల్లి గ్రామంలో మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన తనకు ఈ పదవి కట్టబెట్టిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. 2029 సాధారణ ఎన్నికల్లో వైసిపి విజయమే లక్ష్యంగా పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి, మిధున్ రెడ్డి ఆశీస్సులతో కృషి చేస్తానని తెలిపారు.

## తల్లి ఒడికి చేరిన చిన్నారి జయశ్రీ

తిరుపతి, జనవరి 24ప్రభాతవార్త: తిరుపతి నగరంలోని చింతలచేను ప్రాంతంలో మూడురోజుల క్రిందట అపహరణకు గురైన చిన్నారి జయశ్రీని తిరుపతి పోలీసులు సురక్షితంగా తల్లి ఒడికి చేర్చారు. చిన్నారిని అపహరించుకెళ్ళిన కేసులో ఈస్టు పోలీసులు ఆరుమంది నిందితులను అరెస్టు చేశారు. శనివారం మధ్యాహ్నం ఈస్టుపోలీస్ స్టేషన్‌లో అదనపు ఎస్పీ రవిమనోహరచారి, డిఎస్పీ భక్తవత్సలం, సిఐ శ్రీనివాసులుతో కలసి మీడియాకు వివరించారు. చింతలచేను ప్రాంతంలో నివాసముంటున్న చిన్నారి జయశ్రీని ఎత్తుకెళ్ళిన ఘటనపై సిసికెమోరాల పుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో చిన్నారిని అపహరించుకెళ్ళిన కేసులో తమిళనాడు వేలూరు విడదంబట్టుకు చెందిన మారియమ్మ,కందన్ భార్యాభర్తలతోబాటు చంద్రమ్మ,చిన్నకన్నన్, జయపాల్‌రాజా, అనియమ్మన్‌లను అరెస్టుచేసి, వారినుండి చిన్నారిని,25,271రూపాయలు నగదును,ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకన్నారు. చిన్నారిని తల్లి ఒడికి చేర్చడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

## అనాధలకు దుప్పట్లు పంపిణీ

తిరుపతి, జనవరి 24ప్రభాతవార్త: తిరుపతి నగరంలో అనాధలు, పేదలకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఖాదీకాలనీ ప్రాంతంలో దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ తిరుపతి శ్రీనివాస ఆధ్వర్యంలో చలికాలం దృష్టిలో పెట్టుకుని అనాధలకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందని కోశాధికారి జగన్నాథం, ప్రతినిధులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, కెఆర్ శంకర్, బాసికార్ల రఘు, లోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిని చాటిచెప్పిన నగరసంకీర్తన

తిరుపతి, జనవరి 24ప్రభాతవార్త: ఆధ్యాత్మికనగరం తిరుపతిలో రాయలసీమ రంగస్థలి ప్రతి శనివారం ఉదయం నిర్వహించే నగర సంకీర్తన భక్తుల్లోనూఆధ్యాత్మిక భావం పెంపొందించేలా ఉందని రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. శనివారం వేకువజామున నగరసంకీర్తనలో భాగంగా గోవిందరాజస్వామి ఆలయ మాఢవీధుల్లో రంగస్థలి కళాకారులు గుండాల గోపీనాథరెడ్డి, అన్నారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సుశీల, మునికుమారి, పద్మావతి, కల్పన,ఉషారాణి, పార్వతి, ధనలక్ష్మి, నిర్మలవాసురెడ్డి, మునినాథరెడ్డి, శాంభోలు హరినాథ్, పొన్నాల జేజిరెడ్డి, వాసు,సాయిరెడ్డి తదితరులు కళాకారులతో కలసి నుదుటిన నామం ధరించి భక్తితో భజనలతో నగరంలో గోవింద నామ సంకీర్తనలు హోరెత్తాయి. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు అందించారు.